పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు సక్రమంగా చెల్లించండి

ఏఐటీయూసీ వినతి

విశాలాంధ్ర-గుంటూరు : ప్రభుత్వ సమగ్ర వైద్యశాలలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల జీతాలను సక్రమంగా చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు కోట మాల్యాద్రి, కార్యదర్శి మేడా హనుమంతరావు డిమాండ్ చేశారు. గుంటూరు జీజీహెచ్‌లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కార్మిక సమస్యలపై గుంటూరు జోన్ జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ శ్రీని వాస్ కుమార్, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ ఎ.గాయత్రిదేవి, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ఎస్‌కే సుభానిలకు శనివారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కోట మాల్యాద్రి మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా జీజీహెచ్‌లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతన చట్టాన్ని అమలు చేయకుండా కాంట్రాక్టర్‌తో సూపరింటెండెంట్ మిలాఖత్ అయ్యి వారికి సక్రమంగా జీతాలు చెల్లించకుండా నిర్లక్ష్య వైఖరి అవలంబించడం సరికాదన్నారు. అలాగే కార్మికులకు రావలసిన కనీస సెలవులను క్యాజువల్ సెలవులు ఇవ్వటం లేదని, ప్రావిడెంట్ ఫండ్, ఈఎస్ఐ కటింగ్‌లు తదితర సమస్యలను కూడా పరిష్కరించకుండా కాంట్రాక్టర్ తన ఇష్టారాజ్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. దీనిపై సూపరింటెండెంట్‌ను కలువగా వారు నిర్లక్ష్య సమాధానం చెప్పడంతో కార్మికులందరూ కార్మిక శాఖ అధికారులను కలిసి సమస్యలపై వినతిపత్రం సమర్పించడం జరిగిందన్నారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళనలకు సిద్ధంగా కార్మిక వర్గం ఉందని, కాంట్రాక్టర్, సూపరింటెండెంట్‌లకు ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేడా హనుమంతరావు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వి.బాలయ్య, ఏఐటీయూసీ నగర అధ్యక్షులు రావుల అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

నంబూరు సుభాని పుట్టినరోజు వేడుకలు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : పొన్నూరు రోడ్డులో ఉన్న ఆంధ్ర ముస్లిం కాలేజీ నందు గుంటూరు తూర్పు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే నంబూరు సుభాని పుట్టినరోజు వేడుకలు శనివారం అట్టహాసంగా జరిగాయి. ఈ సందర్భంగా గుంటూరు నగర డిప్యూటీ మేయర్ షేక్ సజీల పూలబొకే, శాలువాతో ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వేడుకల్లో వైఎస్సార్‌సీపీ మైనార్టీ ప్రభుత్వ సలహాదారులు ఎస్ఎం జియావుద్దీన్, జీఎంసీ మాజీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ షేక్. షౌకత్, ఆంధ్ర ముస్లిం కాలేజీ ప్రెసిడెంట్ రెహమాన్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రగతి ప్రయోజన కార్యాలయం ప్రారంభం

విశాలాంధ్ర-తాడేపల్లి : రాష్ట్రీయ గ్రామీణ ప్రగతి ప్రయోజన కార్యాలయాన్ని శనివారం తాడేపల్లి బైపాస్ రోడ్డులోని ఆర్కే రెసిడెన్సీలో ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ సమాధి నరేష్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ రాష్ట్రీయ గ్రామీణ ప్రగతి ప్రయోజన సంస్థకు అనుబంధంగా ఉన్నా కన్య వివాహ యోజన ప్రాజెక్ట్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలు ఉన్నాయని, ఇప్పుడు తాడేపల్లిలో నూతన కార్యాలయాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. కన్య వివాహ యోజన పథకం ద్వారా 0 నుంచి 14 సంవత్సరాలలోపు మహిళలకు ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. కార్యక్రమంలో ఏపీ, తెలంగాణ స్టేట్ కో ఆర్డినేటర్స్ నుతాల పాటి ప్రవీణ్, బోడ్ల శ్రీను, నెలటూరి అనీల్ కుమార్, తెనాలి బ్రాంచ్ కో ఆర్డినేటర్, ఆర్‌జీపీపీ జిల్లా కో-ఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.

సంగం డెయిరీ బోనస్ పంపిణీ

విశాలాంధ్ర-మేడికొండూరు : భీమినేనివారిపాలెం గ్రామంలో పాల ఉత్పత్తిదారుల సహకార సంఘంలో పాల ఉత్పత్తిదారులకు శనివారం బోనస్ పంపిణీ చేపట్టారు. మొత్తం 45 మంది పాల ఉత్పత్తిదారులకు రూ.2,15,245లు బోనస్‌గా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రెంటపాళ్ల బీఎంసీ మేనేజర్ టి.గోపి మాట్లాడుతూ సంగం డెయిరీ పాల ఉత్పత్తిదారుల సంక్షేమమే ధ్యేయంగా రైతులకు ఇన్సూరెన్స్ క్రింద రూ.50 వేలు, పశు బీమా పథకం, నాణ్యమైన గడ్డి విత్తనాలు రైతులకు అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు గంగా శ్రీనివాసరావు, సూపర్‌వైజర్ ఎం.నవీన్, దండ కోటేశ్వరరావు, పాల ఉత్పత్తిదారులు తదితరులు పాల్గొన్నారు.

'అగ్నివీర్' సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : దేశ రక్షణలో యువత పాలు పంచుకోవటానికి చక్కటి అవకాశమని 25(ఎ) బెటాలియన్ లెఫ్టినెంట్ కల్నల్ సీఎస్ సిద్దు అన్నారు. ఈ మేరకు శనివారం స్థానిక అమరావతిరోడ్డులో ఉన్న హిందూ ఫార్మసీ కళాశాలలో అగ్నివీర్ పథకం గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా లెఫ్టినెంట్ కల్నల్ సీఎస్ సిద్దు మాట్లాడుతూ నేటి యువత అగ్నివీర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పిలుపునిచ్చారు. అనంతరం కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు మాట్లాడుతూ దేశ భద్రతకు విపత్తులు సంభవించినపుడు దేశానికి సేవ చేసిన తృప్తి పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ డాక్టర్ ఎస్.మధుసూధనరావు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎంపీ నాగభూషణం, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.రవికుమార్, ఓఎస్‌డీ డాక్టర్ పి.సీతారామయ్య, ఎస్ఎం విజయ్ మోహిత్, ఎన్‌సీసీ ఏఎన్ఓ సీహెచ్.అజిత్‌బాబు, 25(ఎ)బెటాలియన్ అధికారులు, వివిధ కళాశాలల నుంచి ఎన్‌సీసీ క్యాడెట్స్ పాల్గొన్నారు.

సీఎం నిర్ణయంపై హర్షం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం కాంట్రాక్టు ఉద్యోగులు, అధ్యాపకుల జీవితాల్లో వెలుగులు నింపిందని వైఎస్సార్ కాంగ్రెస్ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూనె ఉమామహేశ్వరరెడ్డి తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గుంటూరు యువజన విభాగం నాయకుడు ఆజం మాలిక్ ఆధ్వర్యంలో స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి క్యాంపు కార్యాలయంలో సీఎం చిత్రపటానికి కాంట్రాక్టు ఉద్యోగులు, పెద్ద సంఖ్యలో యువజనులు పాలాభిషేకం-పూలాభిషేకం నిర్వహించారు. ఉమా మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీని తూచా తప్పకుండా అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ సరికొత్త చరిత్ర సృష్టించారని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కోటి, రబ్బానీ, ఆళ్ళ కిరణ్, రెడ్డి కోటేశ్వరరావు, జన్నత్, సుధ, వంశీ, సాయి, బాలాజీ, జానీ, మాబు బాషా తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వార్డు ఎలక్షన్ కౌంటింగ్

విశాలాంధ్ర-పెదనందిపాడు : నియోజకవర్గ పరిధిలోని నాలుగు వార్డులలో మూడు వార్డులు తెలుగుదేశం సానుభూతిపరులు ఒక వార్డు వైసీపీ గెలిచారు. పెద్దగొట్టిపాడు ఈశ్వర ప్రసాద్ 78 ఓట్ల మెజార్టీ, రావిపాడు మహంకాళి పావని 29 ఓట్లు మెజార్టీ, అభినేని గుంటపాలెం మదమంచి వేణుబాబు 127 ఓట్ల మెజార్టీ, వరగాని గూడూరి వీరయ్య చౌదరి 8 ఓట్లు మెజార్టీతో గెలుపొందారు.

బహిరంగ ప్రకటన

మా క్లయింట్ ప్రత్తిపాటి విజయ జోషి S/o.స్వాములు. తుమ్మల వెంకటరెడ్డి, S/o.లక్ష్మారెడ్డి అనే వ్యక్తి దగ్గర అక్షరాల 6,00,000/- రూపాయలు 2017 సంవత్సరంలో కుటుంబ ఖర్చుల నిమిత్తము తీసుకున్నాడు. అతనికి హామీగా 6 ప్రామిసరీ నోట్లు 6 చెక్కులు 2 నాన్ జ్యుడిషల్ స్టాంపులు సంతకం చేసినవి ఖాళీవి ఇవ్వటం జరిగింది. బ్యాంకు ద్వారా రెండు లక్షల రూపాయలు 12 శాతం వడ్డీతో ట్రాన్స్‌ఫర్‌చేయడం జరిగింది. గ్రామ పెద్దల సమక్షంలో [illegible]

సిద్ధం లక్ష్మీ నారాయణ, ప్రత్తిపాటి సత్యనారాయణ, కోటూరు బుజ్జిబాబు, GVSK ప్రసాద్
న్యాయవాదులు, గుంటూరు.

ఆక్రమణదారులపై కేసులు పెట్టే వరకూ పోరాడతాం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకు ఆక్రమణకు గురైన వక్ఫ్‌బోర్డ్ ఆస్తులను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రత్యేక అధికారి షేక్ షిరిన్ బేగ్ స్వాధీనం చేసుకుని అక్రమార్కుల గుండెల్లో ఉక్కుపాదం మోపుతున్నందుకు గుంటూరు జిల్లా వక్ఫ్ బోర్డు కమిటీ వైస్ ప్రెసిడెంట్ స్టార్ మస్తాన్ ప్రత్యేక అభినందనలు తెలిపారు. శనివారం నగరంపాలెంలోని తన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గుంటూరు జిల్లాలోని రెడ్డిపాలెంలో 187 ఎకరాలు, కాకానిరోడ్డు నిర్మిస్ సొసైటి 78, పొన్నూరు రోడ్‌లో షాబా మజీద్ దర్గా వద్ద 7 ఎకరాలు ఇలా వేల కోట్ల రూపాయల ఆస్తులు ఉన్నాయని, వక్ఫ్‌బోర్డు కమిటీ సభ్యుల సహకారంతో త్వరలో అధికారుల దృష్టికి తీసుకెళ్ళి ఆస్తులను స్వాధీనం చేసుకుని ఆక్రమణదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసే వరకు పోరాడతామన్నారు. త్వరలో రాష్ట్ర వక్ఫ్ అధికారి షిరిన్ బేగ్‌కు, గుంటూరు జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి దృష్టికి తీసుకెళ్ళామన్నారు. వక్ఫ్‌బోర్డ్ కమిటీ జాయింట్ సెక్రెటరీ షేక్ సుభాని మాట్లాడుతూ రాష్ట్ర సీఎం వైఎస్ జగన్ గతంలో పాదయాత్ర చేసే సమయంలో ముస్లిం, మైనార్టీల వక్ఫ్‌బోర్డు ఆస్తులను రక్షించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వటం జరిగిందని, ఆ దిశగా జగన్ అడుగులు వేయడం శుభపరిణామమని పేర్కొన్నారు. ఆక్రమణకు గురైన వక్ఫ్‌బోర్డు ఆస్తులను సంబంధిత అధికారులతో స్వాధీన చేసుకుని ఆక్రమణదారులపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బోర్డు కమిటీ సభ్యులు సయ్యద్ సుభాని తదితరులు పాల్గొన్నారు.

యువగళానికి తరలిన టీడీపీ శ్రేణులు

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రకు గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నుండి ఇంచార్జి కోవెలమూడి రవీంద్ర ఆధ్వర్యంలో పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయం నుండి పార్టీ శ్రేణులు భారీగా తరలి వెళ్లాయి. పలు డివిజన్‌ల నుండి ఏర్పాటు చేసిన కార్లు, బస్సులు, బైక్‌లకు కోవెలమూడి రవీంద్ర జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భముగా కోవెలమూడి రవీంద్ర మాట్లాడుతూ యువనేత నారా లోకేష్ పాదయాత్ర గుంటూరు జిల్లా దాటుతున్న సందర్భముగా ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికేందుకు తాము భారీగా బయలుదేరుతున్నామని, ఈ పాదయాత్రతో వైసీపీ ఓటమికి ఒక్కో అడుగుతో పడుతుందని కోవెలమూడి రవీంద్ర తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు.

జన సునామీని తలపిస్తున్న యువగళం

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర జన సునామిని తలపిస్తుందని గుంటూరు జిల్లా తెలుగుయువత అధ్యక్షులు రావిపాటి సాయి కృష్ణ అన్నారు. లోకేష్ ఉమ్మడి గుంటూరు జిల్లాలో జరిగిన యువగళం పాదయాత్ర ముగించుకొని కృష్ణా జిల్లాలోకి ప్రవేశిస్తున్న సందర్భంగా సాయి కృష్ణ ఆధ్వర్యంలో తెలుగుయువత విద్యార్థి నాయకులు భారీగా తరలి వచ్చి ప్రకాశం బ్యారేజి పైన యువనేతకు మద్దతుగా విజయవాడ వరకు పాదయాత్రలో పాల్గొని ఘనంగా వీడ్కోలు పలికారు.

సంక్షేమ పథకాలు వినియోగించుకోవాలి

విశాలాంధ్ర-గుంటూరు : ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతిఒక్కరూ బాధ్యతగా వినియోగించుకోవాలని లేబర్ బోర్డు ఛైర్మన్, బీజేపీ సీనియర్ నాయకులు వల్లూరు జయప్రకాష్ అన్నారు. యువమోర్చా నాయకులు తానుచింతల అనిల్ కుమార్ ఆధ్వర్యంలో స్థానిక అంకమ్మనగర్ కార్తికేయ ఇంటర్నెట్ పాయింట్ నడుపుకుంటున్న బత్తిన కుమారి తన వ్యాపార అభివృద్ధి నిమిత్తం తానుచింతల అనిల్ కుమార్‌ను సంప్రదించగా వెంటనే యూనియన్ బ్యాంక్ సహకారంతో ప్రధానమంత్రి ముద్ర యోజన పథకంలో భాగంగా రూ.1.30 లక్షలు మంజూరు చేయించారు. మంజూరైన డబ్బుతో బత్తుల కుమారి 2 ప్రింటర్లు, డెస్క్‌టాప్, కంప్యూటర్‌ను కొనుగోలు చేసింది. నూతనంగా కొనుగోలు చేసిన పరికరాలను వల్లూరు జయప్రకాష్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కొండముడి భగవాన్ దాస్, కార్తికేయ ఇంటర్నెట్ యజమాని బత్తిన కుమారి, బీజేపీ నాయకులు దేసు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వార్డు నెంబర్ల ఎన్నిక

విశాలాంధ్ర-చేబ్రోలు: వార్డునెంబర్ల ఎన్నికల ప్రశాంతంగా జరిగాయి. మండల పరిధిలోని గుండవరం గ్రామంలో జరిగిన వార్డు నెంబర్ ఎన్నికలలో జి.శివకుమార్ తన ప్రత్యర్థి జాజి పై 15 ఓటర్ల మోజార్టితో గెలుపొందారు. అదే విధంగా తోటపాలెం గ్రామంలో జరిగిన వార్డు నెంబర్ ఎన్నికలలో కె.మీనా తన ప్రత్యర్థి శివ పార్వతి పై 10 ఓటర్ల మోజార్టితో గెలుపొందినట్లు ఎంపీడీఓ బాబూరావు తెలిపారు. వార్డు నెంబర్ల ఎన్నికల నేపధ్యంలో గుండవరం గ్రామంలో ఇరువర్గల మధ్య గొడవ జరగటంతో చేబ్రోలు పోలీస్‌లు గ్రామంలో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు.

యువగళంలో పాల్గొన్న కార్యకర్తలు

విశాలాంధ్ర-మంగళగిరి : పెద్దవడ్లపూడి గ్రామం నుంచి పాతూరి శ్రీనివాసరావు యువగళం పాదయాత్ర గుంటూరు జిల్లాలో 2500 కిలోమీటర్లు పూర్తిచేసుకుని కృష్ణాజిల్లాలో అడుగుపెడుతున్న సందర్భంగా పాతూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, అభిమానులు, మహిళలు విరివిగా ర్యాలీలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేశారు. ఈ సందర్భంగా వారికి పాతూరి శ్రీనివాస్ అభినందనలు తెలియజేశారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింట్ అయిన రెప్కో హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్, గుంటూరు వారి సూచనలమేరకు యావన్మంది ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా, ఈ దిగువ షెడ్యూల్ [illegible] ఈదర శేషరత్నమ్మగారు ది.12-01-2010 [illegible] దస్తావేజు నెం.129/2010గా దఖలు [illegible]

కాసు వెంకట రెడ్డి, అడ్వకేట్
డోర్.నెం.6-14-13, 14/3 అరండల్‌పేట, గుంటూరు.

వాకింగ్ ట్రాక్ పనులు ప్రారంభించాలి

విశాలాంధ్ర-గుంటూరు : నగర నడిబొడ్డులోని కానుమానువారి తోటలో గల లేబర్ వెల్ఫేర్ సెంటర్‌లో వాకింగ్ ట్రాక్ పనులు త్వరితగతిన ప్రారంభించాలని సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి డిమాండ్ చేశారు. గుంటూరు మల్లయ్యలింగంభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక ప్రజల సౌకర్యార్థం వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయడానికి గత కౌన్సిల్ సమావేశంలో రూ.10 లక్షలు మంజూరు చేసిన నగరపాలక సంస్థ మేయర్, కమిషనర్ పనులు ప్రారంభించడంలో మీనమేషాలు లెక్కించడం సరికాదని అన్నారు. గుంటూరు నగర అభివృద్ధికి కౌన్సిల్ తీర్మానం చేసినప్పటికీ ఆ తీర్మానాన్ని అమలు చేయడంలో అధికారులు నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో మేయర్, తూర్పు ఎమ్మెల్యేలు ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ ప్రజా ప్రయోజనాలను పక్కనపెట్టారని విమర్శించారు. ఇప్పటికైనా ఇటువంటి విధానాలు విడనాడి గుంటూరు నగర అభివృద్ధికి తోడ్పాటునివ్వాలని కోరారు. అదేవిధంగా వాకింగ్ ట్రాక్ కోసం కేటాయించిన రూ.10 లక్షలు వెంటనే విడుదల చేసి వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలన్నారు. పరిసర ప్రాంత ప్రజల ఆరోగ్యానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర కార్యవర్గ సభ్యులు రావుల అంజిబాబు, ఆకిటి అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీతో పాటు ఉద్యోగాల కల్పనే ధ్యేయం

విశాలాంధ్ర-గుంటూరు : రాష్ట్ర ప్రభుత్వ నూతన విద్యా విధానంలో విద్యార్థులకు కళాశాల విద్యా బోధనతో పాటు ఉపాధి అవకాశాలను కల్పించడం ద్వారా నిరుద్యోగ నిర్మూలనకు రాష్ట్ర కళాశాల విద్యాశాఖ కృషి చేస్తున్నదని కళాశాల విద్య కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ అన్నారు. స్థానిక ప్రభుత్వ మహిళా కళాశాల(స్వయం ప్రతిపత్తి)లో రాష్ట్ర కమిషనరేట్ ఆఫ్ కాలేజీ ఎడ్యుకేషన్, సొసైటీ ఫర్ జవహర్ నాలెడ్జ్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో 2022-23 సంవత్సరంలో గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల 21 ప్రభుత్వ కళాశాలల్లో డిగ్రీ ఉత్తీర్ణులైన విద్యార్థులకు 'మహా జాబ్ మేళా' కార్యక్రమం శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కమిషనర్ డాక్టర్ భాస్కర్ మాట్లాడుతూ కళాశాల విద్యా శాఖ ఒక ప్రత్యేక దృక్పథంతో పనిచేస్తున్నదన్నారు. ఉపాధి నిచ్చే కోర్సులతో డిగ్రీలో చేరిన ప్రతి విద్యార్థి చదువు ముగిసేలోపు ఉద్యోగ సాధనకు కావలసిన అన్ని రకాల శిక్షణ తీసుకొని ప్రభుత్వం వారు నిర్వహించే జాబ్ మేళాల ద్వారా ఉద్యోగాలు పొంది స్థిరపడాలని కోరారు. డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు విశాల దృక్పథంతో సామాజిక బాధ్యతతో తమ విధులు నిర్వహించాలని హితవుపలికారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.రమా జోస్న కుమారి సభకు అధ్యక్షత వహించగా కళాశాల విద్య అకాడమిక్ గైడింగ్ ఆఫీసర్ డాక్టర్ తులసి మస్తానమ్మ, రాష్ట్ర జవహర్ నాలెడ్జ్ సెంటర్ చీఫ్ కోఆర్డినేటర్ డాక్టర్ రామ్‌గోపాల్, కమిషనర్‌రేట్ కార్యాలయ ప్లేస్మెంట్ ఆఫీసర్ సుధాథర్, కళాశాల జేకేసీ కోఆర్డినేటర్ డాక్టర్ అపర్ణ సీతారాం పాల్గొన్నారు.

జిల్లాలో ప్రభంజనం సృష్టించిన యువగళం

విశాలాంధ్ర-గుంటూరు : ఉమ్మడి గుంటూరు జిల్లాలో నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ప్రభంజనం సృష్టించిందని దేగల ప్రభాకర్ అన్నారు. గుంటూరు జిల్లా యువగళం పాదయాత్ర ముగింపు సందర్భంగా గుంటూరు అర్బన్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీని నిర్వహించారు. స్థానిక కొత్తపేటలోని నందమూరి తారకరామారావు విగ్రహానికి పూలమాలలు వేసి, జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా దేగల ప్రభాకర్ మాట్లాడుతూ జిల్లాలో జరిగిన యువగళం పాదయాత్రతో వైసీపీలో భయంపట్టుకుందన్నారు. ఈ పాదయాత్రలో లోకేష్ ప్రతిఒక్కరిని ప్రేమగా, ఆప్యాయతగా పలకరించి వారి సమస్యను స్వయంగా తెలుసుకున్నారని, ప్రతిఒక్కరికి నేను ఉన్నానంటూ ధైర్యం నింపారన్నారు. ఈ వైసీపీ పాలనలో ప్రతిఒక్కరూ రోడ్డునపడ్డారని మండిపడ్డారు. త్వరలోనే ఈ అరాచక రక్షస పాలనకు రాష్ట్ర ప్రజలు తగిన బుద్ధి చెబుతారని, వైసీపీని బంగాళాఖాతంలో కలపడం ఖాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో సొపాటి రత్నం, కొల్లి అనిల్, లిమిగుంట్ల ఆదం, తాడివాక సుబ్బరావు, బొక్కిసమ్ శివరాం, కొండెపు శేఖర్ బాబు, నిశంకర్ అమర్నాద్, చింతకాయల రామారావు, బొబ్బిలి రామారావు, పెరవలి పవన్ కుమార్, నాగిరెడ్డి, ఎద్దల రమేష్, సంతోష్ కుమార్, ప్రేమ్ కుమార్, శ్రీహరి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వరల్డ్ ఫొటోగ్రఫీ దినోత్సవం

విశాలాంధ్ర-తాడేపల్లి: కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీలోని లలిత కళల విభాగం అధ్వర్యంలో ప్రపంచ ఫోటో గ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఒక రోజు కార్యశాలను ఏర్పాటు చేసినట్లు లలిత కళల విభాగాధిపతి సుభాష్ యలవర్తి తెలిపారు. ప్రముఖ వైల్డ్ లైఫ్ ఫోటోగ్రాఫర్లు డాక్టర్ యోగేష్ బాబు తుంగా, ప్రశాంత్ లు ఆన్ లైన్ ద్వారా ఫోటోగ్రఫీలోని ప్రధాన అంశాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ యోగేష్ బాబు తుంగా మాట్లాడుతూ వివిధ రకాల కెమెరాలు, వాటి ఏర్పాటు చేసుకోవాల్సిన వెలుతురు యొక్క మెళకువల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వర్శిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్ధసారధివర్మ, ప్రో వైస్ చాన్సలర్లు డాక్టర్ ఎవిఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ఎంహెచ్ఎస్ డీన్ డాక్టర్ ఎం.కిషోర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాద బీజేపీని, నియంత జగన్‌ను ఓడించండి

విశాలాంధ్ర-మంగళగిరి : రానున్న ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని, రాష్ట్రంలో నియంత పాలన చేస్తున్న జగన్‌మో హన్ రెడ్డిని ఓడించాలని నవరంగ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు షేక్ జలీల్ పిలుపునిచ్చారు. శనివారం మంగళగిరి ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశ వ్యాప్తంగా ముస్లింలు, క్రైస్తవులుపై దాడులు నిర్వహిస్తున్నా రని విమర్శించారు. దేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత దేశ ప్రజలందరిపై ఉందని అన్నారు. నరేంద్ర మోదీ మతాలు, కులాలు, ప్రాంతాల మధ్య వివాదాలు పెట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని అన్నారు. ఇందుకు ఆర్ఎస్ఎస్, బజరంగ్‌దళ్, వీహెచ్‌పీ పనిచేస్తు న్నాయన్నారు. నవరంగ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా చైతన్య యాత్ర నిర్వహిస్తున్నట్లుగా తెలిపారు. 12 శాతం విద్యా ఉద్యోగ అన్ని రంగాల్లో ముస్లింలకు రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ మేరకు పార్టీ మేనిఫెస్టోను విడుదల చేశారు. రాష్ట్రంలో జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ముస్లింలు, క్రైస్తవులకు అన్యాయం చేసిందని విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్ని దుర్మార్గమైన విధానాలు అవలంబిస్తున్నప్పటికీ వైసీపీ ఎంపీలు పార్లమెంటులో బలపరుస్తున్నారని విమర్శించారు. మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి చేయలేదని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డిని ఓడించడానికి ప్రయత్నిస్తామని అన్నారు. ఈ సమావేశంలో నవరంగ్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎల్ జై బాబు, ముస్లిం ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు షేక్ కమురుద్దీన్, నవరంగ కాంగ్రెస్ పార్టీ నాయకులు షేక్ మస్తాన్, షేక్ మున్నా, ఎస్‌డీ రషీద్ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర గుంటూరు జిల్లా

నాగభూషణం, నరసింహారావు వర్ధంతి జయప్రదం చేయండి

విశాలాంధ్ర-మంగళగిరి : ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం నాయకులు కామ్రేడ్ చిమ్మని నాగభూషణం, అందే నరసింహారావు వర్ధంతి సభ ఆదివారం సాయంత్రం ఐదు గంటలకు వేములపల్లి శ్రీకృష్ణ భవన్లోని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యాలయంలో జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బత్తూరి మోహన్ రావు, గజవల్లి వెంకటకృష్ణ, మంగళగిరి నియోజవర్గ కార్యదర్శి దొడ్డి ఈశ్వరరావు తెలిపారు. శనివారం వేములపల్లి శ్రీకృష్ణ భవన్‌లోని చేనేత రాష్ట్ర కార్యాలయంలో వారు మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గంలోనూ ఆంధ్రప్రదేశ్ లోను చేనేత కార్మికుల సమస్యల పట్ల చేనేత పరిశ్రమ సంక్షోభం నుంచి రక్షించాలని అనేక ఉద్యమాలు చేసి వాటి పరిష్కారం కోసం వారు అహర్నిశలు కృషి చేశారని గుర్తుచేశారు. తమ జీవితాలను తమ కుటుంబాలను కూడా లెక్కచేయకుండా ప్రజా శ్రేయస్సు, కార్మికుల శ్రేయస్సు, చేనేత పరిశ్రమ శ్రేయస్సు కోరి తమ తుది శ్వాస విడిచే వరకు పోరు సల్పారని కొనియాడారు. వీరి వర్ధంతికి మంగళగిరి నియోజకవర్గంలోని చేనేత కార్మికులు, చేనేత శ్రేయోభిలాషులు హాజరై సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

వరదలపై ఆచరణాత్మక వ్యూహం తప్పనిసరి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : వరద పరిస్థితుల్లో సత్వర చర్యలు పర్యవేక్షించేందుకు దేశంలో ఒక విభాగం అంటూ ఏదీ లేకపోవడం బాధాకరమని, అసలు వరదల నిర్వహణకు మన రాజ్యాంగంలో ఏర్పాటేదీ లేదని విశ్లేషకులు ఇ.చంద్రయ్య అన్నారు. స్థానిక అవగాహన సంస్థ కార్యాలయంలో 'వరదల సమస్యలుపై ఆచరణాత్మక వ్యూహాల అవసరం'అనే అంశంపై శనివారం చర్చ జరిగింది. ఈ సందర్భంగా చంద్రయ్య మాట్లాడుతూ పదేపదే వరదల ముప్పు తలెత్తుతున్న వేళ కీలక అంశాలుపై కేంద్ర పెద్దలు తక్షణం సమగ్రంగా దృష్టి పెట్టాలన్నారు. 1970లో నెలకొల్పిన వరదలుపై జాతీయ కమిషన్ తరహాలో వరదల సమస్యలుపై ఆచరణాత్మక వ్యూహాన్ని సూచించేలా ఉన్నత స్థాయి నిపుణుల సంఘాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. సీనియర్ ఇంజనీర్ పి.ఘనశ్యామాచార్యులు మాట్లాడుతూ నీరు, సాగునీటి పారుదల తదితర అంశాలన్నీ రాష్ట్ర జాబితాలోవే కానీ వరదల్లో సహాయ బాధ్యతల నిర్వహణ మాత్రం కేంద్ర, రాష్ట్ర ఉమ్మడి జాబితాలు వేటిలోనూ లేకపోవటం విడ్డూరంగా ఉందన్నారు. ఈ చర్చలో అవధానుల హరి, సింగరయ్య, వెంకటరత్నం, ప్రసాద్ ఉన్నారు.

ఏఎన్‌యూ ఏఐఎస్ఎఫ్ నూతన కమిటీ ఎన్నిక



విశాలాంధ్ర-గుంటూరు : కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం దేశంలోని విశ్వవిద్యాలయాలను అభివృద్ధి చేయకుండా కాలయాపన చేస్తుందని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బందెల నాసర్ జీ అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ(ఏఎన్‌యూ)లో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన నాసర్ జీ మాట్లాడుతూ నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత విశ్వవిద్యాలయాల్లో విద్యార్థుల మధ్య మత ఘర్షణలు రెచ్చగొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విశ్వవిద్యాలయాలకు నిధులు కేటాయించకుండా విద్యార్థులను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. విద్యార్థుల మెదడుల్లోకి అశాస్త్రీయ భావజాలాన్ని నింపే ప్రయత్నంలో భాగంగానే అనేక కోర్సులను ప్రవేశపెడుతున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా అనేక సంవత్సరాలుగా రాష్ట్రంలో ఉన్న విశ్వవిద్యాలయాల్లో టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయకుండా కాలయాపన చేస్తుందన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏఐఎస్ఎఫ్ నాగార్జున యూనివర్సిటీ అధ్యక్షులుగా పాలం నాసరయ్య, ప్రధాన కార్యదర్శిగా అవినాష్, ఉపాధ్యక్షులుగా సురేఖ, వసంత్ నాయక్, ఖాసీం, రాధాకృష్ణ, సహాయ కార్యదర్శులుగా నెహెమియా, దిలీప్, ప్రసాద్, చైతన్య నాయక్, కోశాధికారిగా వాగ్య నాయక్‌లను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

సమాజంలో బాధ్యతగా వ్యవహరించాలి

విశాలాంధ్ర, తెనాలి : విద్యార్థి సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించాలని, తోటి విద్యార్థులతో స్నేహభావంతో మెలగాలని రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె. శ్రీసీత అన్నారు. శనివారం తెనాలి మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి జీ మాలతి ఆదేశాల మేరకు చింతలపూడిలోని ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ర్యాగింగ్ భూతం పడగలు విప్పి విద్యార్థులను బలి తీసుకుంటుందన్నారు. అమాయక విద్యార్థులు అర్ధాంతరంగా తనువు చాలిస్తూ తల్లిదండ్రులకు కడుపుకోత మిగుల్చుతున్నారన్నారు. ర్యాగింగ్ చేసిన వారు సైతం జైలు బాట పట్టి తమ తమ ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని చెప్పారు. సహ విద్యార్థులకు ర్యాగింగ్ ఇతర ఇబ్బందులకు గురిచేయడం లాంటి వాటికి ఆరు నెలల జైలుశిక్ష ఉందని, శారీరకంగా వేధించినా, బలప్రయోగం చేసినా ఏడాది జైలు శిక్ష విధించే అవకాశముందని, అడ్డుకున్నా, గాయపర్చినా రెండేళ్ళ జైలుశిక్షతో పాటు 5వేలు జరిమానా విధించడం జరుగుతుందని తెలిపారు. తీవ్రతను బట్టి శిక్షలు కఠినంగా ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మందలపు వేణుగోపాలరావు, సీనియర్ న్యాయవాది యన్.వి.మహేశ్వరరావు, జీజీహెచ్ మానసిక వైద్యురాలు మంజరి, ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **SURAYA BANU** (Old Name) W/o. **MOHAMMED JAFRULLAH**, R/o. D.No.3-29-7/31, Krishna Nagar Main Road, Guntur - 522006, Guntur District, Andhra Pradesh, have changed my name to **SURAYYA BANU**. Hereafter my name is known as **SURAYYA BANU**.

ప్రకటన

నా క్లయింటున్నా గుంటూరులో కన్నావారితోటలో గల ఎస్‌బిఐ, ఆర్ఏసిపిసి తరపున ఎజిఎం గారు ఇచ్చిన సంజాయిషీ పై యావన్మందికి తెలియజేయునది ఏమనగా, గుంటూరు వాస్తవ్యులు అయిన శ్రీ కారుమంచి శివనాగమల్లేశ్వరరావు, తండ్రి: వీరస్వామి గారి రిజిష్టర్డ్ గిఫ్ట్ దస్తావేజు నెం.5509/2012, ది.29-06-2012 (ఎస్ఆర్ఓ. మంగళగిరి వారి ఆఫీసు) వాలుకు దిగువ షెడ్యూలు ఆస్తిని ఎస్‌బిఐ, గుంటూరు మెయిన్ బ్రాంచ్ వారు నిర్వహించిన వేలంలో దండా శ్రీనివాసరావు గారు కొనుగోలు చేసి, వారు ఎస్‌బిఐలో హోమ్‌లోను తీసుకొని ఉన్నారు. తదుపరి రిజిష్టరు గిఫ్ట్ డీడ్ 5509/2012 ఒరిజినల్ వేలం వేసిన బ్రాంచిలో గాని, నా క్లయింట్ తాలూకా బ్రాంచిలో గాని కనిపించుట లేదు. ఆ ఒరిజినల్ దస్తావేజులు వేరే రికార్డులలో కలిసిపోయి వుండవచ్చుని లేదా బ్యాంక్ ఆఫీస్ షిఫ్టింగ్ లో మిస్‌ప్లేస్ అయివుండవచ్చుని భావించి ఎంత ప్రయత్నం చేసినప్పటికీ కనిపించకుండా వున్నందున ఈ ప్రకటన జారీ చేయడమైనది.

షెడ్యూలు

గుంటూరు జిల్లా, తాడేపల్లి మండలం, కుంచనపల్లి గ్రామ పంచాయతి, డోర్ నెం.3-174/ఎ, సర్వే నెం.19/4, 19/7, 19/8, 19/10, పాత సర్వే నెం.15/ఎ, నందలి 4565.76 చ॥గజాల విస్తీర్ణములోని 40.96 చ॥గజాల విస్తీర్ణములోని రాప్స్ ఎన్‌క్లేవ్ నందు, మొదటి అంతస్తులోని 1035 చ॥అడుగులు మరియు 100 చ॥అడుగుల కార్ పార్కింగ్ గల శ్రీ కారుమంచి శివనాగ మల్లేశ్వరరావు, తండ్రి:వీరస్వామి గారికి చెందిన ఫ్లాట్ నెం.206కు సంబంధించిన యావదాస్తి. ఫ్లాట్‌కు హద్దులు: తూర్పు: ఫ్లాట్ నెం.205, దక్షిణం: వరండా, పడమర: ఫ్లాట్ నెం.213, ఉత్తరం: ఖుల్లాకాళీము, స్థలమునకు హద్దులు తూర్పు: జడ్‌పి రోడ్డు, దక్షిణం: కాజా కోటేశ్వరరావు, కారుమంచి శివనాగ మల్లేశ్వరరావు, కారుమంచి వెంకాయమ్మ యొక్క ఆస్తి, పడమర: ఆరుమళ్ళ వెంకటరెడ్డి మరియు ఇతరుల ఆస్తి, ఉత్తరం: ఆరుమళ్ళ నరసారెడ్డి మరియు ఇతరుల ఆస్తి,

స్థలం : గుంటూరు
తేది: 19-08-2023

కె.వి.ఆర్.హెచ్.ప్రసాద్, ఎం.ఎస్.సి, బి.ఎల్, న్యాయవాది,
డి.నెం.బి-1/72, రవీంద్రనగర్, గుంటూరు-522006,
ఆంధ్రప్రదేశ్, ఫోన్ : 9849084816,

విశాలాంధ్ర పల్నాడు జిల్లా

ప్రశాంతంగా పంచాయతీ ఎన్నికలు

విశాలాంధ్ర-రొంపిచర్ల : విప్పర్లపల్లి గ్రామంలో శనివారం 1వ వార్డుకు ఎన్నికలు జరిగాయి. ఆ వార్డులో మొత్తం 159 ఓట్లకు గాను 144 ఓట్లు పోలయ్యాయి. వార్డు మెంబర్లుగా గాదె కొండారెడ్డి, గాదె రాఘవరెడ్డి పోటీచేశారు. వారిలో గాదె కొండారెడ్డికి 84 ఓట్లు రాగా, గాదె రాఘవరెడ్డికి 60 ఓట్లు వచ్చాయి. 24 ఓట్ల మెజార్టీతో వార్డు మెంబరుగా గాదె కొండారెడ్డి గెలుపొందారు. ఆయనకు ఎన్నికల రిటర్నింగ్ కె.ఆంజనేయులు ఎన్నిక ధృవ పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలింగ్ అధికారి టి.రాఘవేంద్రప్రసాద్, అదనపు పోలింగ్ అధికారి సాంబశివరావు, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఫిరోజ్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

సబ్సిడీపై పశు దానా పంపిణీ

విశాలాంధ్ర-ఈపూరు : మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు సబ్సిడీ ధరపై పశు దానా పంపిణీ జరిగింది. వ్యవసాయ సంచాలకులు పయ్యావుల శ్రీనివాస మూర్తి ఆధ్వర్యంలో శనివారం చేపట్టిన కార్యక్రమంలో ఈపూరు మండలం లోని వనికుంట, ముప్పాళ్ళ, బొమ్మరాజుపల్లి, ఇనిమెళ్ళ, చిట్టాపురం తదితర గ్రామాలకు చెందిన 42 మంది రైతులకు రూ.650లు చొప్పున పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ దానా వలన పశువులకు పాల ఉత్పత్తి మెరుగుపడటంతో పాటు శ్రేష్టమైన పాలు దిగుబడిగా లభిస్తుందని తెలిపారు.

చేతుల శుభ్రతతో వ్యాధులు దూరం

విశాలాంధ్ర-చిలకలూరిపేట : చేతుల అపరిశుభ్రత వలన వ్యాధుల మయమవుతుందని రోటరీ క్లబ్ అధ్యక్షులు కాపు వెంకటరావు అన్నారు. శనివారం డాక్టర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో రోటరీ క్లబ్ చిలకలూరిపేట వారు నిర్వహించిన చేతుల పరిశుభ్రత-అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు 2, 3 నిమిషముల పాటు సబ్బుతో చేతులు శుభ్రం చేసుకున్న తర్వాతనే ఆహారము స్వీకరించాలని అన్నారు. క్లబ్ కార్యదర్శి ఆళ్ల వేమన రెడ్డి మాట్లాడుతూ గోర్లు శుభ్రంగా తీసివేయాలని, మట్టి చేరకుండా చూడాలని, సూక్ష్మజీవులకు అవే నిలయమని, కాబట్టి ప్రతిఒక్కరూ చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని విద్యార్థులకు తెలిపారు. ఈ కార్యక్రమ నిర్వహణకు ఆర్థిక సహకారము అందించిన డైరెక్టర్ పోటు పూర్ణచంద్రరావు, తోటకూర వెంకటనారాయణ, ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

10 ఓట్లతో విజయలక్ష్మి గెలుపు

విశాలాంధ్ర-పెదకూరపాడు : మండల పరిధిలోని మసాపురం గ్రామంలో ఎనిమిదో వార్డు ఉప ఎన్నికల్లో బత్తుల విజయలక్ష్మి 10 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ప్రత్యర్థి బత్తుల నాగరాజుకు 57 ఓట్లు, విజయలక్ష్మి 67 వచ్చాయి. ఒక ఓటు ఇన్ వ్యాలీడ్‌గా గుర్తించారు. గెలుపొందిన అభ్యర్థికి ఆర్‌ఓ సత్యనారాయణ గెలుపొందిన ధ్రువపత్రాన్ని అందించారు. విజయలక్ష్మికి పలువురు వైసీపీ నేతలు అభినందనలు తెలియజేశారు.

జనసేనలోకి 15 కుటుంబాలు చేరిక

విశాలాంధ్ర-వినుకొండ: దొండపాడు గ్రామానికి చెందిన 15 కుటుంబాలు జనసేనలోకి చేరారు. పార్టీ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి నిశ్శంకరావు శ్రీనివాస్ పార్టీ కండువాలు కప్పి వారిని పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలపై స్పందించేది జనసేన మాత్రమేనని, వారాహి యాత్ర త్వరలో గుంటూరు జిల్లాలో ఉంటుందని, ఈ యాత్రలో పవన్ కళ్యాణ్ వినుకొండకు వస్తారని, నియోజకవర్గంలోని ప్రజా సమస్యలపై స్పందిస్తారని, యువత పెద్ద ఎత్తున మార్పు కోరుకుంటున్నారని, రాబోయే ఎన్నికల్లో జనసేన పార్టీ గెలిచి తీరుతుందని శ్రీనివాస్ ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వినుకొండ మండల నాయకులు పాల్గొన్నారు.

కేసానపల్లి సుబ్బారావుకు ప్రశంసాపత్రం అందజేత

విశాలాంధ్ర-వినుకొండ: ఫోటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన ఫోటోగ్రఫీ వేడుకలలో అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఫోటోగ్రఫీ పురస్కారాన్ని వినుకొండకు చెందిన కేసానపల్లి సుబ్బారావు (ఎల్.ఐ.ఐ.పి.సి) హానర్‌కు అర్హత సాధించారు. ఈ హనర్‌ను డిసెంబర్ 1వ తేదీన న్యూఢిల్లీలో ప్రదానం చేయనున్నారు. విజయవాడలో జరిగిన ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకల్లో డాక్టర్ జివి రావు, మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్, మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు చేతుల మీదుగా ప్రశంసపత్రాన్ని సుబ్బారావుకు అందజేశారు. హానర్ పొందిన కేసానపల్లి సుబ్బారావును ఫోటో కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ చైర్మన్ తమ్మ శ్రీనివాసరెడ్డి, ఏ.పి.పి.సి ఫౌండర్ గుత్తా సునీల్ తదితరులు అభినందించారు. వినుకొండ కు చెందిన సుబ్బారావు కు ఈ హనర్ రావడం పట్ల వినుకొండ ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

హోంగార్డు కోదానయ్య మృతి

విశాలాంధ్ర-వినుకొండ: వినుకొండ పట్టణ పోలీస్ స్టేషన్లో హెూంగార్డుగా విధులు నిర్వహిస్తున్న కోదానయ్య గత ఆదివారం సాయంత్రం తన ద్విచక్ర వాహనంపై వెళ్తున్న క్రమంలో మార్కాపురం రోడ్డులోని మౌలి మసీదు వద్ద ఆవు రోడ్డుకు అడ్డంగా రావటంతో ఢీకొని క్రింద పడటంలో తలకి బలమైన గాయం కాగా గుంటూరు లోని ఓ ప్రవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతి చెందారు.

ఘనంగా పుస్తకావిష్కరణ....

విశాలాంధ్ర-వినుకొండ: వినుకొండకు చెందిన ప్రముఖ కవి రచయిత కొదమల కాలేబు రాజు రచించిన 41 అంశాలు కలిగిన పుస్తకాన్ని శనివారం ఏబీఎస్ కాంపౌండ్‌లోని వారి స్వగృహంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సురభి జోసఫ్ కుమార్ మాట్లాడుతూ ఎంతో పేరు ప్రఖ్యాతలు కలిగిన వినుకొండలో మరో గొప్ప కవిని ఈ సీమ ప్రసాదించినదని చెప్పారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రముఖ చిత్రకారులు వజ్రగిరి జస్టిస్ ప్రాసక్రవిత్వంలో పేరెన్నిక గన్న మహాకవుల జాబితాలో కాలేబు రాజు పేరు చిరస్థాయిగా నిలుస్తుందని పుస్తక్ సమీక్ష గావించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా విచ్చేసిన వినుకొండ ఇమ్మానియేల్ తెలుగు బాప్టి చర్చ్ పాస్టర్ పి ఫిలిప్ వాక్య సందేశాన్ని కాలేబు రాజు మనవడు రోహి జన్మదినాన్ని పురస్కరించుకొని కార్యక్రమం నిర్వహించారు. గాయకులు బేతం శ్యాం ప్రసాద్, సంఘ పెద్దలు ప్రేమా ప్రకాష్, గాబ్రియేలు, మోజేష్ తదితరులు పాల్గొన్నారు.

గురజాడ సేవలు స్ఫూర్తిదాయకం: కలెక్టర్

విశాలాంధ్ర-నరసరావుపేట: తెలుగు భాషా, సాహిత్యం, సామాజిక అంశాల పట్ల గురజాడ అప్పారావు సేవలను ఎప్పటికీ మనకు స్ఫూర్తి అని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేట అన్నారు. సమాజంలో తెలుగు భాషా, సాహిత్య మేళ అనే అంశంపై నరసారావుపేట భువన చంద్ర టౌన్ హాల్ నందు శనివారం సాయంత్రం నెల నెలా సాహిత్య మేళ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ శివశంకర్ హాజరై ప్రసంగించారు. సాహిత్యం, క్రమశిక్షణ, దేశభక్తి, పఠనా శక్తి, తెలుగు పుస్తకాలను చదవాలని, భాష పై పట్టు సాధించాలని పిలుపునిచ్చారు. అటువంటి వారే ఉన్నతంగా ఆలోచిస్తారని, తెలివితేటలు కలిగిన వారుగా తయారవుతారని, సమాజంలో ఉన్న దురాచారాలను రూపమాపడానికి వైతాళికులు మాత్రమే మెల్కొల్పుతారని గమనించాలని పేర్కొన్నారు. జాతీయ ఉద్యమంలో స్వాతంత్ర సమర యోధులు అందరూ కలిసి కట్టుగా ఉండాలని దూర దృష్టితో ఆలోచించి రచనలు చేశారని గుర్తు చేశారు. తొలుత కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనతో అతిథులు ప్రారంభించి, తెలుగుతల్లి-గురజాడ అప్పారావుల చిత్ర పటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పలువురు మహిళా ఉపాధ్యాయులు పాడిన పాటలు అందరినీ ఉత్సహపరచగా, పలువురి అతిథులు గురజాడ అప్పారావు రచనల చేసిన ప్రసంగాలు ఆహుతుల్లో సంతోషాన్ని నింపాయి. నవయుగ వైతాళికులు గురజాడ అప్పారావు-ఆధునికత అనే రచనలు అందరిలో ఆలోచనలు నింపాయని, మానవాళికి, విశ్వ ప్రేమ తత్వం కలిగి ఉండాలని అతిథులు సభలో ప్రసంగించారు. గురజాడ అప్పారావు ప్రసంగాలను పలువురు అతిథులు కన్యాశుల్కం, దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మానుషు లోయి అనే నాటకం రచనలను ఉపాధ్యాయులు చెప్పిన ప్రసంగం నెల నెలా... సాహిత్య మేళ కార్యక్రమంలో అబ్బుర పరిచాయి. అనంతరం జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి పలువురి విద్యార్థులకు ప్రశ్నలు వేసి చక్కగా చెప్పిన వారికి తీయ్యటి చాక్లెట్లు పంచి పెట్టారు. కులాల అంతరాలు తగ్గిపోయి, మతాల దృష్టి తగ్గిపోయి, ఆత్మగౌరవ అంశాలు మనిషికి దగ్గర అవుతున్నాయని పలువురు అతిథులు ప్రసంగించారు. కార్యక్రమాన్ని నిర్వహిస్తు నందుకు పలువురు సాహిత్య ప్రేమికులు తమ ఉదారతను విరాళాలను ప్రకటించి మరింత ఉత్సాహ పరిచారు. రాబోయే రోజుల్లో కార్యక్రమాలను మరింత అందంగా నిర్వహించాలంటే ఉపాధ్యాయుల సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు, పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఒక్క ఫోటో వంద ప్రశ్నలకు సమాధానం

నరసరావు పేట భువన చంద్ర టౌన్ హాల్‌లో ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను శనివారం ప్రారంభించారు. లూయిస్ డాగ్రే చిత్ర పటానికి జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి, జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గుంటూరు జిల్లా కు చెందిన ప్రముఖ నేచర్ ఫోటోగ్రాఫర్ టి.ఎస్. వరప్రసాద్, మాష్టర్ హర్షిల్ కిరణ్ అనే 11 ఏళ్ల విద్యార్థి తీసిన

ఫోటోలు, రాఘు అనే ప్రముఖ ఫోటోగ్రాఫర్ తదితరులు తీసిన ఛాయాచిత్రాలను ఎగ్జిబిషన్ జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి, జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, పలువురు జిల్లా అధికారులు తిలకించారు. ఫోటో కెమెరాను కనుగొన్న విధానం,ఫోటోలను తీసే విదానాన్ని అడిగి తెలుసు కొని, పలు కెమెరాలను, వాటి లైన్స్ వివరాలను ప్రత్యక్షంగా పరిశీలించి చూసి మంత్ర ముగ్ధులయ్యారు. పలు వేడుకల్లో ఫోటోగ్రఫీ పోటీల్లో పాల్గొని వచ్చిన ప్రశంసా పత్రాలను, అవార్డులను జిల్లా కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్‌కు చూపడంతో అతిథులు చూసి అభినందించారు. కార్యక్రమంలో ఆయా శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అవినీతిమయంగా పురపాలక సంఘం: జమాల్ బాషా

విశాలాంధ్ర-చిలకలూరిపేట : పురపాలక సంఘంను కుంభకోణాల పురపాలక సంఘంగా పేరును మార్చి వేస్తున్నారని చిలకలూరిపేట పురపాలక సంఘ మాజీ ప్రతిపక్ష నేత జమాల్ బాషా ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం విలేకర్లతో మాట్లాడుతూ పురపాలక సంఘంలో కుంభకోణాల మయమైందని మొన్న బీడీఆర్‌లో, నిన్న ఔట్‌సోర్సింగ్ విభాగంలో కుంభకోణం, నేడు తాజాగా ఇనుము కుంభకోణం బయటపడిందని ఆరోపించారు. రోజు రోజుకు చిలకలూరిపేట పురపాలక సంఘంలో కుంభకోణాలు పెరిగి అవినీతిమయమైందని ఆయన సంబంధిత అధికారులపై విరుచుకుపడ్డారు. కుంభకోణాలు చేసిన వ్యక్తులపై కేసులు పెట్టకుండా వారిని పురపాలక సంఘ ప్రజాప్రతినిధి సంబంధిత అధికారి కొమ్ము కాస్తున్నారన్నారు. ఆ కుంభకోణంలో వారి వాటా ఎంతని ఆయన ప్రశ్నించారు. ఇనుము కుంభకోణంలో కనీసం కౌన్సిల్లో కూడా పెట్టకుండా ఒక ప్రైవేటు వ్యక్తికి రూ.50 లక్షలు విలువైన ఇనుము ఇచ్చి వాటాలు పంచుకున్నట్లు తెలుస్తుందన్నారు. వీటన్నిటిపై పూర్తిస్థాయిలో విజిలెన్స్ అధికారుల విచారణ జరిపించాలని జమాల్ భాష డిమాండ్ చేశారు. చిలకలూరిపేట మున్సిపల్ కమిషనర్ చెక్ పవర్ లేకుండా ఇక్కడ పనిచేస్తున్నాడని మంత్రి నియోజకవర్గంలో డేప్యూటేషన్ అధికారి ఉంటే ఇటువంటి అవకతవకలు జరుగుతూనే ఉంటాయని ఆయన తెలియజేశారు. మంత్రి పేరు చెప్పి పప్పు బెల్లాలా కుంభకోణాలు చేస్తున్న ఈ పురపాలక సంఘాన్ని. ప్రజలను రక్షించాలని జమాల్ బాషా కోరారు.

రామలింగేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి శ్రీకారం

విశాలాంధ్ర-వినుకొండ: భక్తుల చిరకాల ఆకాంక్ష నెరవేరే విధంగా వినుకొండ కొండపై వేంచేసి ఉన్న శ్రీ రామలింగేశ్వర స్వామి గుడికి ఘాట్ రోడ్ నిర్మాణ పనులు, గిరి ప్రదక్షిణ రోడ్డు పనులు చేపట్టారు. వినుకొండ శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు సారథ్యంలో ఈ గుడి నిర్మాణం సాగుతుంది. ఈ విధంగా వినుకొండ ప్రాంత ప్రజల కొంగు బంగారంగా కొలిచే శ్రీ రామలింగేశ్వర స్వామి గుడి నిర్మాణం అనంతరం ఈ ప్రాంతాన్ని ఒక పర్యటన స్థలంగా తీర్చి దిద్దేందుకై కొండపై 273 అడుగుల ఎత్తులో గాలి గోపురాన్ని నిర్మించలానే ఆలోచనలో ఉన్నట్లు శాసనసభ్యులు చెప్పారు. ఈ విధంగా వినుకొండ చరిత్రని దేశం నలుమూలల విస్తరించే విధంగా ఈ గుడి నిర్మాణం జరుగుతుందని, ఈ నిర్మాణానికి దైవ చింతన కలవారు తమ సహాయ సహకారాలు అందించాలని కోరారు. వచ్చే శివరాత్రి నాటికీ ఈ గుడి నిర్మాణం పూర్తి చేసి భక్తులకి అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు.

కేఎల్‌యూలో కిసాన్ మహోత్సవ్

విశాలాంధ్ర-తాడేపల్లి: ఏరువాక ఫౌండేషన్ కిసాన్ మహెూత్సవ్ 23 కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీలో శనివారం ఘనంగా జరిగింది. కెఎల్ టెక్నాలజీ ఇంక్యుబేటర్స్ ఫౌండేషన్, ఎసిఐసి కెఎల్ స్టార్టప్స్ ఫౌండేషన్ లు కలిసి సంయుక్తంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయంలో 2022వ సంవత్సరంలో మన రాష్ట్రంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన రైతులకు వార్షిక అవార్డులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమం వలన దేశానికి రైతులు ఎంత ముఖ్యమో తెలియజేసినట్లవుతుందని కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయిన కోరమండల్ ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షులు జి.వి.సుబ్బారెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్, అగ్రి మార్కెటింగ్, వ్యవసాయ కోపరేటివ్ విభాగ ముఖ్య కార్యదర్శి చిరంజీవ్ చౌదరి ప్రత్యేక అతిథిగా, ఏరువాక ఫౌండేషన్ వ్యవస్థాపకులు రాఘవరావు, కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ కెఎస్.జగన్నాథరావు అతిథులుగా హాజరయి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో వైస్ చాన్సలర్ జి.పార్థసారదివర్మ, ప్రో వైస్ చాన్సలర్లు డాక్టర్ ఎవిఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, కెఎల్ టిఎఫ్ ముఖ్య కార్యనిర్వహణాధికారి అలోక్ గోవిల్, పరిశోధనా అభివృద్ధి డైరెక్టర్ డాక్టర్ శరత్, ఎసిఐసి సెంటర్ విబాగాధిపతి రమన్ కాంత్, వ్యవ సాయ విబాగాధిపతి సెంథిల్ మురగన్, డైరెక్టర్ రత్నప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బంధువుల మధ్య ఆస్తి గొడవలు

విశాలాంధ్ర, తెనాలి : తెనాలి, గంగానమ్మపేటలో బంధువుల మధ్య ఆస్తిగొడవలు కారణంగా పట్టపగలు కర్నూలు నుంచి 10 మంది దుండగులు ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యులపై దౌర్జన్యం చేశారు. ఆస్తి కాగితాలపై సంతకాలు పెట్టమని లేకపోతే చంపుతామని బెదిరించారు. కుటుంబ సభ్యులు భయంతో కేకలు వేయడంతో చుట్టుప్రక్కల వారు రావడంతో దుండగులు పారిపోయారు. వారిలో ఒకరిని స్థానికులు పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఆస్తి తగాదాల నేపథ్యంలోనే దాడికి పాల్పడ్డారని బాధితులు చెప్పారు. తమకు వారసత్వంగా వచ్చిన 10 కోట్ల రూపాయల ఆస్తిపై కన్నేసి బలవంతంగా సంతకాలు చేయించుకుంటున్నారంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

జీఎస్టీ పోస్టుకు స్రవంతిరెడ్డి ఎంపిక

విశాలాంధ్ర, తెనాలి : ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ నిర్వహించిన గ్రూప్-01 పరీక్ష ఫలితాల్లో తెనాలి పట్టణానికి చెందిన మారంరెడ్డి స్రవంతిరెడ్డి 10వ స్థానంలో నిలిచి అసిస్టెంట్ కమీషనర్ జీఎస్టీ పోస్టుకు ఎంపికైనారు. తెనాలి నియోజకవర్గ శాసనసభ్యులు అన్నాబత్తుని శివకుమార్ ఆమెను శాలువాతో సత్కరించి అభినందించారు.

బ్యాంకు మోసగాళ్లు అదుపులోకి..

విశాలాంధ్ర-గురజాల: పట్టణంలో నకిలీ బంగారు ఆభరణాలు బ్యాంకులలో తాకట్టు పెడుతున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు. రోల్డ్ గోల్డ్ బంగారానికి గోల్డ్ కోటింగ్ వేసి బ్యాంకులలో తాకట్టుపెట్టి బ్యాంకులనే మోసగిస్తున్న ఘరానా మోసగాళ్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మొత్తం 26 బంగారు గాజులకు నకిలీ కోటింగ్ వేసి బ్యాంకులలో తాకట్టు పెట్టేందుకు ఈ ముఠా ప్రయత్నించింది. వాటిలో ఆరు గాజులను కారంపూడి రోడ్డులోని ఓ ప్రముఖ బ్యాంకులో తాకట్టు పెట్టి లక్ష రూపాయల గోల్డ్ లోన్ కూడా ఈ ముఠా కొట్టేసింది. కొన్ని నకిలీ గాజులను తాకట్టు పెట్టేందుకు ప్రయత్నిస్తుండగా వేరే బ్యాంకులోని సిబ్బందికి అనుమానం వచ్చింది. దీంతో బ్యాంకు సిబ్బంది అప్రమత్తమై పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించిన పోలీసులు నకిలీ బంగారం తాకట్టు పెడుతున్న ముఠాను గురజాలలోని ఓ ప్రాంతంలో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ ముఠాకు సంబంధించిన వివరాలపై అన్ని కోణాలలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

9న జాతీయ లోక్ అదాలత్

విశాలాంధ్ర-గురజాల: న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు సెప్టెంబర్ 9న మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లుగా మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, 10వ అదనపు జిల్లా జడ్జి జి వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాతీయ లోక్ అదాలత్ నందు రాజీ పడదగిన, క్రిమినల్ కేసులను బ్యాంకు కేసులను చెక్ బౌన్స్ కేసులను, మోటారు వాహన ప్రమాదం కేసులు బిఎస్ఎన్ఎల్ కి సంబంధించిన తదితర కేసులు రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవచ్చని తెలియజేశారు. తద్వారా కక్షిదారులకు సమయము మరియు ధనము ఆదా అవుతుంది అని తెలియజేశారు. గురజాల కోర్టు ప్రాంగణంలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు జాతీయలోక్ అదాలత్ కొనసాగును కావున కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఎస్ఎన్ఎల్ డీఈ, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ రాజ్ డీఈ శ్రీనివాసరెడ్డి బాధ్యతలు

విశాలాంధ్ర-మాచర్ల : మాచర్ల పంచాయతీరాజ్ డీఈగా పాశం శ్రీనివాస్ రెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు వెల్దుర్తి పీఆర్ ఏఈగా పని చేస్తూ పదోన్నతి పొందిన శ్రీనివాసరెడ్డి గతంలో పలు మార్లు రాష్ట్ర ఉత్తమ ఇంజినీర్‌గా అవార్డులు పొందారు. పాశం శ్రీనివాస రెడ్డి డీఈగా పదోన్నతి పొంది మాచర్లకు రావడం సంతోషంగా ఉందని పల్నాడు వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండా రెడ్డి అన్నారు. పదోన్నతి పొందిన శ్రీనివాసరెడ్డిని సహచర ఉద్యోగులు, రాజకీయ ప్రముఖులు అభినందించారు.

రెండు వార్డుల్లో వైసీపీ, టీడీపీ అభ్యర్థుల గెలుపు

విశాలాంధ్ర-అమరావతి : మండల పరిధిలోని ధరణికోట గ్రామానికి చెందిన 11వ వార్డులో శనివారం జరిగిన వార్డు ఎన్నికలలో కంభంపాటి జైల్ సింగ్ వైసీపీ అభ్యర్థి గెలవగా... యాండ్రాయి గ్రామంలోని రెండో వార్డుకు జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి యడ్ల శ్రీనాథ్ గెలుపొందారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి పి.ఉమాదేవి తెలిపారు. కార్యక్రమంలో పోలీసులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సమస్యలపై ప్రీ లిటిగేషన్ కేసు దాఖలు చేసిన లాయర్లు

విశాలాంధ్ర-తెనాలి : వీధికుక్కల వలన ఎందరో కుక్కకాట్లకు గురి అవుతున్నారని, చెత్త ట్రాక్టర్లకు నెట్ కట్టకుండా ఊడ్చిన రోడ్లను పాడుచేస్తున్నారని, కొబ్బరి బోండాల వ్యాపారులు నాణ్యతాప్రమాణాలేని, సరైన తూకంలేని బాటిల్స్ వాడకం, బిల్డింగ్ కట్టే సమయంలో వాడే ఇసుక, చిప్స్ మొదలగునవి పబ్లిక్ రోడ్లమీద లోడ్ చేయించి పబ్లిక్‌కు ఆటంకం కలిగిస్తున్నారని, స్వీట్స్ షాపు ఓనర్స్ ఎక్స్పైరీ డేట్ లేకుండా అమ్ముతున్నారని, ఖాళీ స్థలాలను అలాగే వదిలేసిన యజమానులపై చర్యలు తీసుకోకుండా దోమలు, పందులకు అనువుగా ఉండటం, ప్లాస్టిక్ బ్యాగులో వేడి వేడి సాంబారు, కూరలు పాక్ చేసే హోటల్స్‌మీద, డ్రైనేజ్‌ల మీద షాపులు ఉండటం వలన డ్రైనేజ్‌లో సిమెంట్ పడటం వలన నీళ్ళు సరిగ్గా పారక వర్షాకాలంలో రోడ్లన్నీ జలమయం అవ్వడం మొదలగు సమస్యల మీద పిఎల్‌సి సర్వీసెస్ కమిటీ ముందు వాయిదా ఉన్నట్లు ఈ పిటీషన్ వేసిన మాజీ న్యాయవాది పెరికల డేనియల్, న్యాయవాదులు గజ్జా శ్రీనివాస్ గౌడ్, కె.యస్.వి. అంజనీకుమార్‌లు తెలిపారు.

ఉమ్మడి గుంటూరు జిల్లాలో పూర్తయిన లోకేష్ పాదయాత్ర

విశాలాంధ్ర-తాడేపల్లి : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ఉమ్మడి గుంటూరు జిల్లాలో పూర్తయింది. 188వ రోజు ఉండవల్లి మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నివాసం వద్ద నుంచి లోకేష్ పాదయాత్ర మొదలుపెట్టారు. ప్రజావేదిక శిథిలాలే సైకోపాలనకు సమాధిరాళ్లని నారా లోకేష్ అన్నారు. జగన్ సైకోయిజానికి ప్రత్యక్షసాక్షి ఉండవల్లిలోని ప్రజావేదిక. అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో 2019 జూన్ 25న మొదలైన కూల్చివేతల పర్వం ఇప్పటికీ కొనసాగుతూనే ఉందని, 51 నెలల రాక్షస పాలనలో గూడు కోల్పోయిన లక్షలాది పేదల కన్నీరు దావానలంగా మారుతోంది. ఏ విధ్వంసంతో నువ్వు పాలన ప్రారంభించావో అక్కడి నుంచే నీ పతనం ప్రారంభం కాబోతోందని అన్నారు. దార్శనికుడు చంద్రబాబునాయుడు ముందుచూపునకు నిదర్శనం కొండవీటివాగు ఎత్తిపోతల పథకం అన్నారు. రాజధాని ప్రాంతంలో కొండవీటి వాగు ముంపు సమస్య శాశ్వత పరిష్కారానికి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రూ.222 కోట్లతో ఈ ఎత్తిపోతల పథకాన్ని నిర్మించారని రికార్డు సమయంలో కేవలం 18 నెలల్లో పూర్తిచేసి 2018 సెప్టెంబర్ 16న రాష్ట్రప్రజలకు అంకితం చేశారన్నారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చాక నియోజక వర్గంలో ఇళ్లులేని 20 వేల మంది నిరుపేదలకు ఇళ్లు నిర్మిస్తానని హామీ ఇస్తూ శిలాఫలకం ఆవిష్కరించాను. దీంతోపాటు అసైన్డ్, కొండ, వాగు, అటవీ, రైల్వే, ఇతర భూముల్లో నివసిస్తున్న పేదల ఇళ్లను క్రమబద్ధీకరించి పట్టాలు అందజేస్తానని లోకేష్ తెలిపారు. అడుగడుగునా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ప్రకాశం బ్యారేజి యువగళంతో పోటెత్తింది. ప్రకాశం బ్యారేజి వద్ద ఉమ్మడి గుంటూరు జిల్లా నేతలు వీడ్కోలు పలికారు. భారీగా తరలివచ్చిన జనంతో జనసంద్రంగా ప్రకాశం బ్యారేజి పరిసరాలు మారాయి. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు ప్రత్తిపాటి పుల్లారావు, నక్కా ఆనందబాబు, మాజీ ఎమ్మెల్యేలు జీవీ ఆంజనేయులు, తెనాలి శ్రావణ్ కుమార్, యరపతినేని శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, టీడీపీ నాయకులు పోతినేని శ్రీనివాసరావు, నందం అబద్దయ్య, తమ్మిశెట్టి జానకి దేవి, ఆకుల జైసత్య, ఆరుద్ర భూలక్ష్మి, టీడీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకటరావు, మండల అధ్యక్షులు అమరా సుబ్బారావు, కొల్లి శేషు, దారా దాసు, జంగాల సాంబశివరావు, కొమ్మారెడ్డి కిరణ్, జంగాల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత కళాకారులు లేకపోవడం బాధాకరం

విశాలాంధ్ర-పెదకూర పాడు : ఈ నెల 15వ తేదిన స్వాతంత్ర్య దినోత్సవం నాడు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఓబీసీకి చెందిన చేతి వృత్తికళాకారులకు 5 శాతం వడ్డీతో ఒక లక్ష రూపాయలు ఋణం అందిస్తామని, అవి అందుకొన్నవారికి మరలా రూ.2 లక్షల వరకు అందిస్తామన్నారని, ఇది గురువారం మంత్రి మండలి ఆమోదం పొందడం కూడా జరిగింది శుక్రవారం 18 చేతివృత్తులు వారిని కూడా ప్రకటించడం జరిగిందని, కానీ వారిలో చేనేత కళాకారులు లేకపోవడం చాలా బాధాకరమని పెదకూరపాడు నియోజకవర్గం జాతీయ చేనేత ఐక్య వేదిక సంఘం అధ్యక్షులు చిల్లపల్లి సత్యం ఒక ప్రకటనలో అన్నారు. జాతీయ చేనేత ఐక్య వేదిక సంఘం తరుపున తాము ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ చేనేత కళాకారులు చేతివృత్తిలకు సంబంధించిన వారుకాదా! అందుకే చేనేతకు జీఎస్టీ విధించారా, అసలే సంక్షోభంలో కూరుకుపోయిన చేనేత రంగం మీ విధానాల వల్ల కోలుకునే అవకాశం లేదని అన్నారు. ఇలాంటి సమస్యల పరిష్కారం కోసం, అంతరించిపోతున్న చేతివృత్తుల వారి చైతన్యం కోసం త్వరలోనే చేతివృత్తుల ఐక్య వేదిక పార్టీని ఏర్పాటు చేసి రాజకీయంగా సామాజికంగా వెనుకబడిన కులాల అందరికోసం రాజకీయంగా పోరాటం చేయబోతున్నామని అన్నారు.

వలంటీర్లకు శిక్షణ

విశాలాంధ్ర-అమరావతి : చేయూత కార్యక్రమంలో భాగంగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ గురించి స్థానిక మండల ప్రజా పరిషత్తు అధికారిని పి.ఉమాదేవి వలంటీర్‌లకు శనివారం శిక్షణ కార్యక్రమం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల పరిధిలోని గ్రామ పంచాయితీ పరిదిలోని 902 మంది ఫార్మర్స్ రేపు మధ్యాహ్నంలోపు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. మండల పరిధిలోని ఆయా గ్రామాలలో ఆయా పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, వెటర్నింగ్ అసిస్టెంట్లు, అగ్రికల్చర్ అసిస్టెంట్లు, వలంటీర్‌లు తదితరులు సూపర్‌వైజ్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

సాగర్‌ను సందర్శించిన వియాత్నాం బౌద్ధుల బృందం

విశాలాంధ్ర-విజయపురిసౌత్: ప్రపంచ పర్యాటక ప్రాంతమైన నాగార్జున సాగర్‌ను వియత్నాం దేశానికి చెందిన 17 మంది బౌద్ధులు గురువారం సందర్శించారు. ముందుగా సాగర్ ప్రాజెక్టు ముఖ ద్వారం వద్ద ఆచార్య నాగార్జునుడి విగ్రహం వద్ద వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అనుపులోని పునర్నిర్మిత కట్టడాలైన యాంఫి థియేటర్, మహాస్థూపం, హారతి దేవాలయం, అశ్వమేథ యజ్ఞశాల, శ్రీచైత్యంలను బౌద్ధులు తిలకించారు.

పీఎం కిసాన్ దరఖాస్తు రైతుల విచారణ

విశాలాంధ్ర-దుర్గి: పీఎం కిసాన్ పథకం కోసం నూతనంగా దంఖాస్తు చేసుకున్న రైతులను తహశీల్దార్ జి.రమేష్ కుమార్, మండల వ్యవసాయాధికారి వై.అమీర్ రెడ్డి విచారించారు. మండలంలో 206 మంది రైతులు పీఎం కిసాన్ పథకం కోసం నూతనంగా ఆన్లైన్లో ధరఖాస్తు చేసుకున్నారు. దానికి సంబంధించి జాబితా వ్యవసాయ శాఖ కార్యాలయానికి వచ్చింది. ఆ జాబితా ప్రకారం ఆ రైతులను వారివారి సచివాలయాలకు శనివారం పిలిపించి విచారణ చేపట్టారు. వారి వెంట అగ్రికల్చర్ అసిస్టెంట్ రాఘవ ఉన్నారు.

పాఠశాలలో బ్లేజ్ పాస్కల్ వర్ధంతి

విశాలాంధ్ర-పెదకూర పాడు: మండల పరిధిలోని 75త్యాళ్ళూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం పాస్కల్ సూత్రం కనిపెట్టిన శాస్త్రవేత్త బ్లేజ్ పాస్కల్ వర్ధంతిని ఘనంగా నిర్వహించి నివాళులు అర్పించారు. ద్రవ పదార్థంలో ఏదైనా ఒక బిందువు వద్ద పీడనాన్ని ఉపయోగించడం జరిగితే ఆ పీడన ప్రభావం ఆ ద్రవ పదార్థం అన్ని వైపులకు సమానంగా విస్తరిస్తుందనే పాస్కల్ సూత్రాన్ని ఆధారంగా చేసుకుని సిరెంజ్ని, హైడ్రాలిక్ ప్రెస్‌ను, హైడ్రాలిక్ బ్రేక్ను రూపొందించటం జరిగిందని సైన్స్ ఉపాధ్యాయులు పేర్కొన్నారు. జామెట్రీ, ప్రాబబిలిటీ, హైడ్రోస్టాటిక్స్, ఎంటగ్రల్ కాలిక్యులస్ అంశాల మీద పాస్కల్ చేసిన విలువైన పరిశోధనలు మానావాళికి ఎంతగానో ఉపయోగపడ్డాయని వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అన్నపురెడ్డి శ్రీనివాస రెడ్డి,పీసి చైర్మన్ జీ.శ్రీనివాస రెడ్డి, సైన్స్ ఉపాధ్యాయులు బాజీఖాన్, వెంకటరమణ, సుబ్బారావు, భాస్కర్ రెడ్డి, అరుణ, విద్యార్థులు పాల్గొన్నారు.

పాతూరు యువతి అదృశ్యం

విశాలాంధ్ర-తాడేపల్లి : గత మూడు రోజులుగా ప్రాతూరుకు చెందిన అనూష అనే యువతి అదృశ్యమై కనిపించకుండా పోయింది. యువతి తల్లిదండ్రులు తాడేపల్లి పోలీసులను ఆశ్రయించారు. మూడు రోజులు గడిచిన ఎలాంటి సమాచారం లేకపోవటంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. యువతికి మతిస్థిమితం సరిగ్గా లేదంటూ తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. యువతి అదృశ్యంపై తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

వైభవంగా లక్ష్మీపూజలు

విశాలాంధ్ర-తాడేపల్లి: విజయ కీలాద్రి దివ్య క్షేత్రంపై శనివారం సాయంత్రం త్రిదండి చిన్న జీయర్ స్వామి త్రిదండి అహెూబల రామానుజ జీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో సామూహిక లక్ష్మీ పూజలు అత్యంత వైభవంగా జరిగింది. 2000 వేల మంది భక్తులు పూజా కార్యక్రమంలో పాల్గొని స్వామివారి మంగళశాసనలు అందుకున్నారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మాచర్ల గారి కోర్టులో
O.S NO : 152/2022

బిట్వీన్ :
1) చేపూరి వెంకట వైష్ణవి
2) చేపూరి గణేష్ - వాదులు
(వాదులు నెం. 1&2 మైనర్లు అయినందున Rep by తల్లి/నాచురల్ గార్డియన్ పేరు చేపూరి లక్ష్మి గౌతమి)

మరియు

చేపూరి వెంకట సుబ్బారావు మరియు వగైరాలు - ప్రతివాదులు

ప్రతివాది నెంబర్ - 4 అడ్రస్సు : రామిదేని ప్రసన్న కోటేశ్వరరావు తండ్రి ఆంజనేయులు (సర్పంచి), హిందువు, 23 సంవత్సరాలు, స్టూడెంట్ R/o. ఒప్పిచర్ల గ్రామము, కారంపూడి మండలం, పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం.

పై దావాలోను మరియు I.A 897/22 నందు ప్రతివాది నెంబర్-4, ది.24-8-2023న ఉదయం 10:30 గంటలకు శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై తన ఆక్షేపణలను తెలియజేయగలరు. అట్లు ప్రతివాది నెం.4 శ్రీ కోర్టువారి ఎదుట హాజరుకాని యెడల పై దావా మరియు I.A 897/22 నందు తన పరోక్షమందు తీర్మానించెదరని తెలియజేయడమైనది.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది. 24-8-2023.

అవుల ఉదయకుమార్ రెడ్డి
వాదుల తరపు న్యాయవాది
R/o మాచర్ల - 522426.
పల్నాడు-జిల్లా, సెల్ - 9959194708.

విశాలాంధ్ర
బాపట్ల జిల్లా

తహశీల్దార్‌కు సన్మానం

విశాలాంధ్ర - చీరాల : ప్రజల సమస్యలు పరిష్కరించుటలో ముందుండి పనిచేసిన ప్రతి చోటా ప్రతి ఒక్కరి ఆదరాభిమానాలు పొందుతూ రాష్ట్రంలోనే చీరాలను ప్రథమ స్థానంలో తహశీల్దారు ప్రభాకర్ ఉంచారని ఆంధ్రప్రదేశ్ ఎస్సి,ఎస్టీ,బీసీ మైనారిటీస్ ఐక్య వేదిక అధ్యక్షులు జ్యోతి రమేష్‌బాబు అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో,రాష్ట్రంలోనే చీరాలను మొదటి స్థానంలో నిలబెట్టిన చీరాల తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావును ఆంధ్రప్రదేశ్ ఎస్సి,ఎస్టీ,బీసీ మైనారిటీస్ ఐక్య వేదిక అధ్యక్షులు జ్యోతి రమేష్ బాబు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జ్యోతి రమేష్‌బాబు మాట్లాడుతూ ప్రభాకరరావు ప్రజల మనిషిగా చిత్తశుద్ధితో పనిచేస్తారని ఎక్కడ అధికారదర్పం కనబడనియకుండా ప్రజలతో మమేకమైపోతారన్నారు. ఈ కార్యక్రమంలో కార్యావర్గ సభ్యులు అంకం నాగరాజు, ఇస్టాళ్ల వెంకటసుబ్బారావు, జ్యోతి దేవిడ్,బుజ్జి కొమ్మాలపాటి, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో శ్రద్ధ వహించాలి

విశాలాంధ్ర - చీరాల రూరల్ : విధుల నిర్వహణలో శ్రద్ధ వహించి బాధ్యతగా మెలగాలని చీరాల మునిసిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం మునిసిపల్ కార్యాలయంలో సచివాలయం సిబ్బందికి,వార్డు వాలంటీర్లకు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విధి నిర్వహణలో అలసత్వాన్ని సహించబోమన్నారు. పనులు సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజల నుండి ఫిర్యాదులు అందితే చర్యలు తప్పవని హెచ్చరించారు. బాధ్యతగా పనిచేసి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది,వార్డు వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

న్యాయ అవగాహన సదస్సు

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : ఫార్మాసి కాలేజీలో శనివారం జరిగిన న్యాయ అవగాహన సదస్సులో అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి వాణి పాల్గొని చట్టాలు భారతీయ శిక్షాస్మృతి, సెక్షన్లు గురించి విద్యార్థులకి వివరించారు. పట్టణ ఎస్సై రఫీ ర్యాగింగ్‌తో పాటు సోషల్ మీడియా వల్ల జరుగుతున్న నష్టాల పట్ల విద్యార్థులను అప్రమత్తం చేశారు. సైబర్ నేరాలతో పాటు యువతను ప్రక్కదోవ పట్టి పీడిస్తున్న లోన్ యాప్‌కు దూరంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ భీమా లీలా కృష్ణ, సీనియర్ న్యాయవాదులు ఊట్ల రామారావు, బండి రామ్మూర్తి, డాక్టర్ సందీప్, కాలేజీ ప్రిన్సిపాల్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

6వ వార్డులో సుబ్బులు విజయం

విశాలాంధ్ర - బాపట్ల రూరల్ : మండలంలోని జిల్లెళ్లమూడి గ్రామ పంచాయతీలో శనివారం జరిగిన 6వ వార్డు ఉప ఎన్నికలో వైసీపీ బలపరిచిన అభ్యర్థి మీనుగుల సుబ్బులు 10 ఓట్ల మెజార్టీతో టీడీపీ బలపరచిన అభ్యర్థి షేక్ రోషన్‌బీపై గెలుపొందారు.

బేతపూడిలో సుజ్ఞానమ్మ విజయం

విశాలాంధ్ర - రేపల్లె : మండలంలోని బేతపూడి గ్రామపంచాయతీ 7వ వార్డుకు జరిగిన ఉపఎన్నికల్లో టిడిపి బలపరిచిన అభ్యర్థిని అమర్తలూరు సుజ్ఞానమ్మ విజయం సాధించారు 7వ వార్డులో మొత్తం 257 ఓట్లు ఉండగా 206 ఓట్లు పోలయ్యాయి.వీటిలో 112 మంది మహిళలు ఓటు హక్కు వినియోగించుకోగా 94 మంది పురుషులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.టిడిపి బలపరిచిన అమృతలూరి సుజ్ఞానమ్మ తన ప్రత్యర్థి వైసిపి బలపరిచిన దోవారి మార్త కుమారి పై 35 ఓట్ల మెజారిటీతో గెలుపొంది నట్లు ఎన్నికల అధికారి గోపాలకృష్ణ తెలియజేశారు.

పరిశ్రమల స్థాపనపై శిక్షణ

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : ఉత్తమ వ్యవసాయ పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే అవకాశాన్ని ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం కల్పిస్తుందని బాపట్ల వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డా. వి. శ్రీనివాసరావు అన్నారు. కళాశాలకు చెందిన 10 మంది బియస్సీ ప్రథమ సంవత్సరం విద్యార్థినులు హైదరాబాద్‌లోని సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమల జాతీయ సంస్థలో శిక్షణ కు ఎంపికయ్యారని విద్య, విస్తరణ, పరిశోధన, కన్సల్టెన్సీ అంశాలలో శిక్షణ పొందారన్నారు. సంస్థాగత అభివృద్ధి ప్రణాళిక లో భాగంగా శిక్షణ ఇవ్వబడుతుందని ఆయన వివరించారు. ఈ కార్యక్ర మంలో ఐడిపి. ఎన్‌ఏహెచ్‌ఏపి. కో ఆర్డినేటర్లు, డాక్టర్ కె.చంద్రశేఖర్, వి. సీతారాంబాబు, బి. రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

జనసేన ఆధ్వర్యంలో అన్నదానం

విశాలాంధ్ర - చీరాల రూరల్ : జనసేన పార్టీ ఆధ్వర్యంలో చీరాల నియోజకవర్గంలో డొక్కా సీతమ్మ పేరుతో 20వ అన్నదాన కార్యక్రమం దుగ్గిరాల గోపాలకృష్ణయ్య పార్కు దగ్గర నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ నాయకులు మాట్లాడుతూ ప్రతి శనివారం నియోజకవర్గంలో ఈ అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. పేద ప్రజల ఆకలి బాధ తీర్చేందుకు తమ వంతు సహకారం అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేనపార్టీ నాయకులు గూడూరు శివరామ ప్రసాద్, మామిడాల శ్రీనివాసరావు, వీర మహిళలు, నాయకులు, యువత, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు

విశాలాంధ్ర - చీరాల : విద్యార్థులు క్రమశిక్షణతో ఇష్టపడి చదివితే జీవితంలో ఉన్నత శిఖరాలు చేరవచ్చని అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి నిషాద్‌నాజ్ అన్నారు. పట్టణంలోని నీలం జేమ్స్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో శనివారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తి మాట్లాడుతూవిద్యార్థులు బ్యాడ్ టచ్,గుడ్ టచ్ గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. కొన్నిరకాల చట్టాలతోపాటు పోక్సో చట్టాలపై అవగాహనకలిగి ఉండాలన్నారు. విద్యతోనే మంచిగుర్తింపు వస్తుందని,చదువుకోవడం ద్వారా విద్యార్థులు అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చున్నారు. జీవితంలో ఉన్నత స్థాయికి చేరాలంటే విద్యే మార్గమని, ప్రతివిద్యార్థి ఉన్నతస్థాయికి చేరేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ నీలం శామ్యూల్ మోజెస్,ప్రధానోపాధ్యాయులు ఆర్.వి.రమణ, సీనియర్ న్యాయవాదులు శారదా,శకుంతల, సయ్యద్ మతీన్,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారానికి కృషి: కలెక్టర్

విశాలాంధ్ర - వేటపాలెం : పేదల సొంతింటి కల సాకారానికి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందని జిల్లా కలెక్టరు పి.రంజితా బాషా చెప్పారు. వేటపాలెం మండలం పందిళ్లపల్లి పంచాయతీ చల్లారెడ్డిపాలెం గ్రామం కొణిజేటి నగర్-2ను కలెక్టర్ శనివారం పరిశీలించారు. చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తితో కలిసి ఆయన రూ.13 లక్షల రుణాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. తొలుత ఉపాధిహామి నిధులతో కాలనీలో నిర్మిస్తున్న ఇంకుడు గుంతలు, లబ్ధిదారులు నిర్మించుకుంటున్న పక్కా గృహాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేదలకు స్థిరనివాసాలను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి ఈనెల 30వ తేదీన జగనన్న కాలనీని ప్రారంభిస్తున్నారని చెప్పారు. అదే స్ఫూర్తితో ప్రతి జిల్లాలో ఒక కాలనీని సిద్ధం చేస్తున్నందున జిల్లాలో కొణిజేటి నగర్-2 కాలనీని ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కాలనీలో 303 మందికి ఇంటి నివేశన స్థలాలు పంపిణీ చేయగా 283 పక్కా గృహాలు మంజూరయ్యాయన్నారు. ప్రస్తుతం 270 గృహాలు నిర్మిస్తుండగా 203 గృహాలు తుది దశకు చేరుకుని మరో 10 రోజుల్లో పూర్తికానున్నాయని వివరించారు. ఈనెల 30వ తేదీన కాలనీతోపాటు అన్ని గృహాలు ప్రారంభించడానికి లబ్ధిదారులు సిద్ధంగా ఉండాలన్నారు. ఇప్పటివరకు రూ.1.20 కోట్లు రుణాలు ఇచ్చామన్నారు. ప్రస్తుతం రూ.5 లక్షలతో ఇంటింటికి కొళాయి కనెక్షన్ ఇస్తున్నామన్నారు. రూ.38.25 లక్షలతో రహదారులు మంజూరయ్యాయని వారంలో పనులు మొదలవుతాయన్నారు. అన్ని గృహాలకు ఉచిత విద్యుత్ కనెక్షన్లు ఇస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎమ్మెల్యే కరణం బలరాం మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసమే ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. గృహాలు సుందరంగా నిర్మించుకోవడానికి అవసరమైన నగదు, నిర్మాణ సామగ్రిని ప్రభుత్వం పంపిణీ చేస్తుందన్నారు. జిల్లాలోని జగనన్న కాలనీలలో పక్కా గృహాల నిర్మాణానికి అధికారులు సమన్వయంతో చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్థిరమైన నివాసాలు ఏర్పాటు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో చీరాల ఆర్.డి.ఓ పి.సరోజిని, గృహనిర్మాణ శాఖ పి.డి ప్రసాద్, డి.ఆర్.డి.ఏ పి.డి బి.అర్జున్ రావు, డ్వామా పి.డి వై.శంకర్ నాయక్, ఆర్.డబ్ల్యు.ఎస్ ఎస్.ఇ బెనహర్, పి.ఆర్ ఎస్.ఇ హరేరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

చిన్నమట్లపూడిలో అధికార పార్టీ నాయకుల రిగ్గింగ్

విశాలాంధ్ర -రేపల్లె : వార్డుమెంబర్ ఎన్నికల్లో వైసీపీ నాయకులు పోలీసులను అడ్డం పెట్టుకుని రిగ్గింగ్‌కు పాల్పడ్డారని టీడీపీ వర్గీయులు ఆరోపించారు. నగరం మండలం చినమాట్లాపూడి గ్రామంలోని 3వ వార్డుకు శనివారం నిర్వహించిన ఎన్నికల్లో అధికారపార్టీ నాయకులు వీరంగం సృష్టించారు. ఉదయం 11 గంటల వరకు ప్రశాంతంగా జరిగిన ఎన్నికలు అధికార పార్టీ నాయకులు రావటంతో గందరగోళం నెలకొంది. వైసీపీ నాయకులు ఓటమి భయంతో పోలింగ్ భూత్‌లోనికి ప్రవేశించి దౌర్జన్యంగా టీడీపీ పోలింగ్ ఏజెంట్‌గా విధులు నిర్వహిస్తున్న మునాఫ్‌ను బయటకు నెట్టి వేశారని చెప్పారు. వైసీపీకి చెందిన నిజాంపట్నం మాజీ జడ్పిటిసి ప్రసాదం వాసుదేవరావు పోలింగ్ బూత్‌లోకి రావడంతో అలజడి రేగిందన్నారు. అడ్డు చెబితే అంతు చూస్తామని బెదిరించి రిగ్గింగ్‌కు పాల్పడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రసాదం వాసుదేవరావు, స్థానిక సర్పంచ్, ఇతర వైసీపీ సానుభూతిపరులు బూత్‌లోనికి వస్తున్న అక్కడ ఉన్న రూరల్ సీఐ శివశంకర్, ఎస్సై రామకృష్ణ అడ్డు చెప్పకుండా రిగ్గింగ్ చేస్తుంటే సహకరించారని ఆరోపించారు. చినమాట్లాపూడి 3వ వార్డులో మొత్తం 290 మంది ఓటర్లు ఉండగా 266 ఓట్లు పోలయ్యాయి. 135 మంది మహిళలు, 131 మంది పురుషులు తమ ఓటు హక్కును ఉపయోగించుకున్నారు. రిగ్గింగ్ నేపథ్యంలో ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియకు వెళ్లకుండా టీడీపి వర్గీయులు నిరసన వ్యక్తం చేశారు. పెద్దల జోక్యంతో కౌంటింగ్ నిర్వహించారు. వైసీపీకి చెందిన నూరుద్దీన్, సమీప టీడీపీ సానుభూతి పరునిపై 62 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.

రీపోలింగ్ జరపాలంటూ టీడీపీ నిరసన

బుద్దాంలో ఎన్నికల అధికారి అత్యుత్సాహం

విశాలాంధ్ర - బాపట్ల : కర్లపాలెం మండలం బుద్దాం పంచాయితీలో శనివారం జరిగిన 6వ వార్డు ఉప ఎన్నికలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఫైజుద్దీన్ అత్యుత్సాహం చూపించారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం 1 గంట వరకు పోలింగ్ జరిగిన తరువాత 2 గంటల నుంచి ఓట్లు లెక్కించాల్సి ఉంది. అయితే ఫైజుద్దీన్ 1 గంటకు పోలింగ్ ముగిసిన వెంటనే అభ్యర్థులను పిలిచి లెక్కింపు మొదలుపెట్టారు. 146 ఓట్లకు 137 ఓట్లు పోలవటంతో లెక్కింపు 20 నిమిషాల్లోనే ముగిసింది. రిటర్నింగ్ అధికారి ఎన్నికల కమీషన్‌ను ఇచ్చిన షెడ్యూల్ కాకుండా తన స్వంత షెడ్యుల్ ప్రకారం ఓట్లు లెక్కించటం వివాదస్పదంగా మారింది. ఫైజుద్దీన్ కర్లపాలెం మండల పరిషత్ కార్యాలయంలో ఏవోగా విధులు నిర్వహిస్తున్నారు. జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు అండతో తన స్వంత అజెండాగా ప్రతి పనిలో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. డీపీవో రాంబాబు కర్లపాలెం ఎంపీడీవో కావటంతో దుకుడుగా వ్యవహరిస్తున్నారంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయంపై కలెక్టర్ రంజిత్‌బాషాకు, జేసీ శ్రీధర్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. ఇరువురిపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నిరుద్యోగులను మోసగించిన క్రాంతి అరెస్టు

విశాలాంధ్ర - చీరాల రూరల్ : బ్యాక్ లాగ్ పోస్టులు ఇప్పిస్తానని ఎస్సీ నిరుద్యోగుల నుంచి లక్షల రూపాయలు వసూలు చేసిన యాతం క్రాంతిని ఈపురుపాలెం ఎస్సై జనార్ధన్ శనివారం అరెస్టు చేశారు. ఈ మేరకు రూరల్ సీఐ మల్లిఖార్జునరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేరుతో ఫోర్జరీ నియామక పత్రాలు ఇచ్చి మోసం చేశాడని మండలంలోని వాడరేవు గ్రామానికి చెందిన రూబేను, మరికొందరు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా అరెస్టు చేసి, కోర్టుకు హాజరుపరిచినట్లు తెలిపారు. క్రాంతికి వైద్య పరీక్షల అనంతరం రిమాండ్‌కు తరలించారు.

వంట గ్యాస్ కనెక్షన్‌లపై ప్రత్యేక మేళా

విశాలాంధ్ర - కర్లపాలెం : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రతి ఒక్కరికి గ్యాస్ కనెక్షన్ అందించాలని ఉద్దేశంతో హెచ్.పి. గ్యాస్ ఆధ్వర్యంలో ఎస్.సి. డీబీసీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు ప్రసాద్ రాజు తెలిపారు. శనివారం కర్లపాలెం హెచ్.పీ గ్యాస్ ఏజెన్సీ కార్యాలయం వద్ద నిర్వహించిన ప్రత్యేక మేళాలో జడ్పిటిసి పిట్ల వేణుగోపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు స్టవ్,కనెక్షన్లు అందజేశారు.

వరహాపురం 10వ వార్డులో సుభాషిని విజయం

విశాలాంధ్ర - వేమూరు : వరహాపురం గ్రామపంచాయతీ పరిధిలో శనివారం నిర్వహించిన 10వ వార్డు ఉప ఎన్నికలో వైసీపీ బలపరిచిన అభ్యర్థి విజయం సాధించారు. వార్డు పరిధిలో 149 మంది ఓటర్లు ఉండగా 119 ఓట్లు పోలయ్యాయి. పోటీలో ఉన్న తెలుగుదేశం పార్టీ బలపరిచిన అభ్యర్థి వరికుటి కృష్ణకుమారికి 47కి ఓట్లు రాగా, వైసీపీ బలపరచిన అభ్యర్థి పిల్లి సుభాషిణికి 72 ఓట్లు వచ్చాయి. దీంతో వైసీపీ అభ్యర్థి సుభాషిని 25 ఓట్ల మెజార్టీతో విజయం సాధించినట్లు ఎన్నికల అధికారి శ్రీనివాసరావు ప్రకటించారు. గత ఎన్నికల్లో జరిగిన వివాదాస్పదమైన సంఘటనను దృష్టిలో పెట్టుకుని పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేసి పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించారు. ఎన్నిక అనంతరం అధికారులు విజయం సాధించిన సుభాషినికి నియామక పత్రం అందించారు. ఎన్నిక ప్రక్రియను తాసిల్దార్ శ్రావణ్ కుమార్, సిఐ వెంకటేశ్వరావు, ఎస్సై నాగరాజు, పరివేక్షించారు. కార్యక్రమంలో ఈఓపిఆర్డి శేఖర్ కార్యదర్శి సునీత తదితరులు పాల్గొన్నారు.

27న ఉచిత మెగా వైద్య శిబిరం

విశాలాంధ్ర - మార్టూరు : మార్టూరు గ్రానైట్ వెల్ఫేర్ అసోసియేషన్, రోటరీ క్లబ్ ఆఫ్ మార్టూరు సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 27వ తేదీ ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు గ్రానైట్ వెల్ఫేర్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు ఇంటూరి ఆంజనేయులు తెలిపారు. తమ్మినేని సూపర్ స్పెషలిటీ హాస్పిటల్ సౌజన్యంతో అన్ని రకాల వ్యాధులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయనున్నట్లు పరిసర గ్రామ ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

పరిసరాల పరిశుభ్రతతోనే దోమల నివారణ

విశాలాంధ్ర - బల్లికురవ : ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారానే దోమల నివారించవచ్చని మండల వైద్యాధికారులు డాక్టర్ రమీజు అహ్మద్,డాక్టర్ భారతి సూచించారు. శనివారం ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా గుంటుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి ర్యాలీ నిర్వహించి దోమల నివారణ పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దోమకాటు వలన డెంగ్యూ, మలేరియా, బోదకాలు, చికెన్‌గున్యా, మెదడువాపు వ్యాధులు వ్యాపిస్తాయన్నారు. వర్షాకాలం ప్రారంభమవడంతో ప్రతి ఒక్కరు తమ ఇంటి పరిసరప్రాంతాల్లో మురుగు నీరు నిలవలేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రాత్రి వేళలో దోమతెరలు వాడాల అన్నారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు మంచినీటి ట్యాంకులు,బోర్లు,నీటి కొళాయిలు,మురుగు కలవలు వద్ద బ్లీచింగ్ చల్లాలన్నారు. ఎవరైనా జ్వరంతో బాధపడుతుంటే తక్షణమే గ్రామాలలోని ఆశ కార్యకర్త అంగన్వాడీ కార్యకర్తను సంప్రదించాలన్నారు. జ్వరం తగ్గకపోతే మెరుగైన వైద్యం కోసం గుంటుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలన్నారు. ఈ ర్యాలీలో సూపర్వైజర్లు శ్రీనివాసరావు,వెంకటేశ్వర్లు ఏఎన్‌ఎంలు అపర్ణ,అనుష,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్దేశపూర్వకంగానే ఫారం-7

విశాలాంధ్ర - యద్దనపూడి : రాజకీయ లబ్ది కోసమే గ్రామాలలో గొడవలు చేయడానికి, ప్రజల మధ్య విద్వేషాలు రగిలించడానికి ఫారం 7ను అప్లోడ్ చేస్తున్నారని టిడిపి మండల నాయకులు అన్నారు. పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆదేశాల మేరకు వినతిపత్రాన్ని డిప్యూటీ తహసిల్దార్ మస్తాన్‌రావును తహసిల్దార్ కార్యాలయంలో శనివారం కలిసి అందజేశారు. మండలంలోని అనంతవరం గ్రామంలో బూతు నెంబర్ 75 లో 208 ఓట్లు ఉద్దేశ పూర్వకంగానే తొలగించుటకు ఫారం 7ను ఆన్లైన్లో నమోదు చేస్తున్నారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా పెట్టిన ఫారం 7 దరఖాస్తులన్నింటిని ఈఆర్ఓ ద్వారా స్వయంగా పరిశీలన చేయించి తిరస్కరించాలని కోరారు. దోషులపై కఠిన చర్యలు తీసుకొని 1950 యాక్ట్ లో31వ సెక్షన్ ప్రకారం కేసు నమోదు చేసి,ఇటువంటి చర్యలు మరలా పునరావృతం కాకుండా వారిని శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు నల్లపనేని రంగయ్య చౌదరి, రాయపాటి సీతయ్య, కనపర్తి నాగేశ్వరరావు, గుదే తారక రామారావు, కొరటాల వంశీకృష్ణ, కోయ సతీష్, ఈరపనేని వాసు, సూరిశెట్టి శ్రీనివాసరావు బోయపాటి సాంబశివరావు, షేక్ బాజీ,ఈదల అనిల్, రాయుడు పాల్గొన్నారు.

డ్రాప్ అవుట్స్ విద్యార్థులను గుర్తించాలి

విశాలాంధ్ర - బాపట్ల : పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో డ్రాప్ అవుట్స్ విద్యార్థులను గుర్తించి పాఠశాల, కళాశాలల్లో చేర్పించాలని జిల్లా కలెక్టరు పి. రంజితా బాషా తెలిపారు. డ్రాప్ అవుట్స్ విద్యార్థుల వివరాలపై అనుబంధశాఖల అధికారులతో శనివారం ఆయన తన చాంబర్లో సమావేశం నిర్వహించారు. బడి ఈడు పిల్లలంతా తప్పనిసరిగా విద్య అభ్యసించేలా పర్యవేక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 6 నుంచి 18 సంవత్సరాలలోపు వయసు ఉన్న చిన్నారుల వివరాలను స్టూడెంట్ ఇన్ఫోపోర్టల్ లో నమోదు చేశారని తెలిపారు. 47 వేల మంది విద్యార్థులు పాఠశాలల్లో చేరాల్సి ఉండగా, 50 శాతం పైగా విద్యార్థులు కళాశాలలో చేరినట్లు నివేదికలు ఉన్నాయన్నారు. మిగిలిన 23,248 మంది విద్యార్థుల వివరాలలో స్పష్టత లేకపోవడంపై కలెక్టర్ ఆరా తీశారు. విద్యార్థుల వివరాలు నమోదు చేయకుండా ఏం చేస్తున్నారని విద్యాశాఖ అధికారులపై మండిపడ్డారు. 9,485 మంది విద్యార్థులు జిల్లాలోనే ఆయా కళాశాలల్లో ఇంటర్మీడియట్ కొరకు చేరారని తెలిపారు. మిగిలిన 700 మంది విద్యార్థులు వివరాలు నేటికీ సేకరించకపోవడం ఏమిటని అధికారులను ప్రశ్నించారు. పాఠశాలల్లో 5,121 మంది విద్యార్థులు డ్రాప్ అవుట్స్ జాబితాలోనే ఉండడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటివరకు ఆ విద్యార్థులంతా ఎక్కడ ఉన్నారో, ఏం చేస్తున్నారో, ఏం చదువుతున్నారో సమగ్ర వివరాలు సేకరించి స్టూడెంట్ ఇన్ఫోలో నమోదు చేయాలని ఆదేశించారు. వలసలు, శాశ్వత వలసలు, మృతులు అనారోగ్యంతో ఇంట్లోనే ఉన్న వారి వివరాలపై స్పష్టంగా నివేదిక ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో ఇంటర్మీడియట్ బోర్డ్ డివిజనల్ ఆర్ ఐ ఓ ఆంజనేయులు, ఏఎస్ఓ సంజీవరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కమిషన్‌కు టీడీపీ ఫిర్యాదు

విశాలాంధ్ర-రేపల్లె : నగరం మండలం చినమాట్లాపూడి ఉప ఎన్నికల నేపథ్యంలో పోలీస్ అధికారులు, పంచాయతీ సిబ్బంది వ్యవహరించిన తీరుపై టీడీపీ నేతలు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. జిల్లలోని నగరం మండలం, చినమట్లపూడి గ్రామంలోని 3వ వార్డు ఉప ఎన్నికల నామినేషన్ దగ్గర నుండి రేపల్లె రూరల్ సీఐ శివశంకర్ నగరం ఎస్సై రామకృష్ణలు పోటీచేసిన అభ్యర్థిని భయభ్రాంతులకు గురిచేశారని తెలిపారు. ఆగస్ట్ 18వ తేదీన చిన్నమాట్లాపూడి పంచాయితిలోని యానిమేటర్‌లు, మాలిన్‌బి, జోస్న, ఫీల్డ్ అసిస్టెంట్ తిరుపతమ్మ, వాలంటీరు యాస్మిన్, అంగన్వాడీ ఆయా ఫర్విన్‌లు ప్రచారం చేస్తూ పబ్లిక్‌గా డబ్బులు పంచారని తెలిపారు. వార్డు ఉప ఎన్నిక ముందు రోజు నగరం ఎస్సై రామకృష్ణ, రేపల్లె రూరల్ సిఐ శివశంకర్‌లు దగ్గర ఉండి వైసిపి బలపరిచిన అభ్యర్థి నూరుద్దీన్ తరుపున డబ్బులు పంచుతున్న వారికి రక్షణ కల్పించారన్నారు. శనివారం ఎన్నికలు జరుగుతుండగా పథకం ప్రకారం 230 ఓట్లు పోలైన తరువాత ఓటమి భయంతో నిజాంపట్నం మాజీ జెడ్పీటీసీ ప్రసాదం వాసుదేవరావు చిన్నమట్లపూడి సర్పంచ్ అనుచరులతో బూతులోకి వచ్చి టీడీపీ ఏజెంట్ అబ్దుల్ మునాఫ్‌ను సీఐ శివశంకర్ సహకారంతో బయటకు పంపి రిగ్గింగ్‌కు పాల్పడి ప్రజా స్వామ్యమును అపహాస్యం చేశారన్నారు. నగరం ఎస్సై రామకృష్ణ, రేపల్లె రూరల్ సీఐ శివశంకర్ నిబంధనలకు విరుద్ధంగా మరోక మండలానికి చెందిన మాజీ జడ్పీటీసీ ప్రసాదం వాసుదేవను బూత్‌లోకి పంపి దౌర్జన్యం చేశారన్నారు. ఎన్నికల నిబంధనలు పాటించని సదరు సి ఐ,ఎస్సైలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

అనేక కార్యక్రమాల్లో పాల్గొన్న గొట్టిపాటి

విశాలాంధ్ర - బల్లికురవ : ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అద్దంకి నియోజకవర్గంలో శనివారం పలు కార్యక్రమాలకు హాజరయ్యారు. సంతమాగులూరు మండలం మిన్నెకల్లు గ్రామానికి చెందిన చిరుమామిళ్ళ వెంకట ప్రసాద్ వెంకట లక్ష్మి దంపతుల కుమార్తె వివాహానికి హాజరై వధువు వెంకటపూజను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. మిన్నెకల్లు గ్రామంలో ఇటీవల వట్టికుండ వెంకట నారాయణ రోడ్డు ప్రమాదంలో గాయపడగా వారి నివాసానికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కామేపల్లి గ్రామానికి చెందిన గాడిపర్తి శ్రీనివాసరావు ఉమాదేవి దంపతుల కుమారుని వివాహానికి హాజరై వరుడు గోపిశంకర్‌ను ఆశీర్వదించారు. మక్కెనవారిపాలెం గ్రామంలో మిరియాల శ్రీనివాసరావు (ఆర్.ఎం.పి వైద్యుడు) నూతన గృహప్రవేశ వేడుకకు హాజరయ్యారు. బల్లికురవ మండలం కె.రాజుపాలెం గ్రామంలో నాగభైరు బ్రహ్మయ్య నూతన గృహప్రవేశ వేడుకకు హాజరయ్యారు. అనంతరం బ్రహ్మయ్య మనుమరాలి ఓణీల వేడుకకు హాజరై చిన్నారి లాస్యకు ఆశీస్సులు తెలిపారు. అదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మురళి అనారోగ్యంతో బాధపడుతుంటే వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. కొప్పెరపాడు గ్రామానికి చెందిన కామినేని వెంకటేశ్వర్లు మాతృమూర్తి దశదినకర్మకు హాజరై వారి చిత్రపటానికి నివాళులు అర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. కొరిశపాడు మండలం కొరిశపాడు గ్రామానికి చెందిన దాట్ల వేణు ఇటీవల మృతిచెందగా వారి నివాసానికి వెళ్లి వేణు చిత్రపటానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. గొట్టిపాటి వెంట ఆయా గ్రామాల తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

ముస్లిం ఐక్యవేదిక జిల్లా కార్యాలయం ప్రారంభం

విశాలాంధ్ర - పిట్టలవానిపాలెం : ముస్లిం ఐక్యవేదిక జిల్లా కార్యాలయంను మండ లంలోని చందోలులో ప్రారంభించినట్లు రాష్ట్ర అధికార ప్రతినిధులు సయ్యద్ ఖలీల్, అబ్దుల్ అజీజ్ తెలిపారు. శనివారం చందోలులో వారు మాట్లాడుతూ ఈ నెల 27న గుంటూరులోని బి కన్వెన్షన్‌లో జరిగే ముస్లిం ఐక్యవేదిక సమావేశానికి ప్రతి ఒక్క ముస్లిం సోదరులు పాల్గొనాలని వారు కోరారు. ముస్లిం సోదరులు ఐక్యతే తమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం ఐక్యవేదిక బాపట్ల జిల్లా అధ్యక్షులు మౌల బేగ్, ప్రధాన కార్యదర్శి ఎండి గౌస్ బాషా, కర్లపాలెం మండల అధ్యక్షులు బాజీ బాబు, నియోజకవర్గ అధ్యక్షులు జాకీర్ హుస్సేన్ (తాజు), సెక్రటరీ ఇస్మా, జిల్లా గౌరవ అధ్యక్షులు జిలాని, మస్తాన్ బేగ్, రియాజ్, భాషా, నయీమ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ మండపం పనులు ప్రారంభం

విశాలాంధ్ర - పిట్టలవానిపాలెం : మండలంలోని చందోలు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ లింగోద్భవ స్వామి వారి దేవస్థానం తూర్పు భాగంలో గల ఖాళీ స్థలము లలో దేవాదాయ శాఖకు చెందిన సిజిఎఫ్ గ్రాంట్ రూ.54 లక్షలతో 4వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో కళ్యాణ మండపం పనులు శనివారం ప్రారంభమైయ్యాయని ఆలయ కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి శనివారం తెలిపారు. ఈ నిధుల మంజూరుకు ఎమ్మెల్యే కోన రఘుపతి విశేష కృషి చేశారన్నారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని దేవాదాయ శాఖ ఎండోమెంట్ ఏఈ ఆర్.చక్రధర్‌రావు ఆదేశించారని పనులు కాంట్రాక్టర్ దాసరి కృష్ణ తమ సిబ్బందితో వచ్చి ప్రారంభం చేసి అతి త్వరలోనే పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అర్చకులు దండిభొట్ల వెంకటసుబ్బయ్య, శ్రీనివాస్ శాస్త్రి, దేవస్థానం సిబ్బంది కొండవీటి శ్రీనివాసరావు, మహేష్, విష్ణు పాల్గొన్నారు.

మహిళల సంక్షేమమే టీడీపీ ధ్యేయం

విశాలాంధ్ర - చీరాల రూరల్ : మహిళల సంక్షేమమే ధ్యేయంగా మహానాడు వేదికగా ప్రవేశపెట్టిన మహాశక్తి సంక్షేమ పథకాలు తెదేపా నాయకులు ఇంటింటికి తిరిగి పథకాలపై అవగాహన కల్పించారు. నియోజకవర్గంలోని పిట్టువారిపాలెం గ్రామ పంచాయతీ రాముల వారి గుడి సెంటర్ నుండి ఇంటింటికి తిరిగి పథకాలపై అవగాహన కల్పించి కరపత్రాలు పంపిణీ చేశారు. తెలుగుదేశంపార్టీ అధికారంలోకి వస్తేనే మహిళల అభ్యున్నతి సాధ్యమవుతుందన్నారు. మహిళల అభివృద్ధి, సంక్షేమం టీడీపీ ధ్యేయం అన్నారు. ఈ కార్యక్రమంలో కొతరపు జనార్ధన్ రావు,పురుషోత్తం, సుబ్రహ్మణ్యం, చంద్రమౌళి, కొమ్మనబోయిన రజిని, బుర్రా కవిత, యర్ర శివ నాగమల్లేశ్వరి, నందం లావణ్య, బుద్ది దుర్గా మల్లేశ్వరి, దేవన విజయలక్ష్మి, ఆకురాతి సుజాత, పడవల లలిత, తిరువీధుల నారాయణమ్మ, షేక్ పర్వానా, పొట్టేటి రాజేశ్వరి, శిరందాసు కాళిదాస్, షేక్ లాల్ అహ్మద్, తెదేపా నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

అధికారులకు ఘన సన్మానం

విశాలాంధ్ర - బల్లికురవ : స్వాతంత్ర దినోత్సవ రోజున జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ ఉద్యోగులుగా ప్రతిభ కనపరిచి అవార్డులు అందు కున్న అధికారులను శనివారం బల్లికురవ తాసిల్దార్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఉత్తమ ఏఎస్ఓగా అమర్నాథ్ ఉత్తమ వీఆర్వోగా మల్లాయపాలెం గ్రామ వీఆర్వో రత్నరాజు ఉత్తమ గ్రామ సర్వేయరుగా ఎస్ఎల్ గుడిపాడు సర్వే షేక్ ఇమ్రాన్‌లు పంద్రాగస్టు రోజున అవార్డులు అందుకోగా ఈరోజు తాసిల్దార్ రవిబాబు,డిప్యూటీ తాసిల్దార్ రవికుమార్,వీఆర్వోలు విలేజ్ సర్వేర్లు వీరిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ మాట్లాడుతూ ఉత్తమ ఉద్యోగులుగా ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో అవార్డులు అందుకోవటం అభినందనీయం అన్నారు. ప్రతి ఒక్కరు ఇలాంటి స్ఫూర్తితో ముందుకు సాగాలని అధికారులకు సూచించారు.

పర్యావరణ సమతుల్యతకు మొక్కలు నాటాలి

విశాలాంధ్ర-పర్చూరు: పర్యావరణ సమతుల్యతకు మొక్కలు నాటాలని ఇడుపులపాడు విద్యా పరిషత్ ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ అధికారి పిడపర్తి పేరిరెడ్డి తెలిపారు. పాఠశాలలో శనివారం అజాతికా అమృత మహోత్సవం ముగింపు కార్యక్రమంలో భాగంగా మేరీ మాటి మేరా దేశ కార్యక్రమంలో భాగంగా ఎన్‌సీసీ విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ స్వతంత్ర్యం కోసం అమరులైన స్వతంత్ర్య సమరయో ధులకు, దేశ రక్షణ కోసం అమలైన వీర సైనికులకు నివాళులర్పిస్తూ... మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ కేర్‌టేకర్ బండారు అనిల్‌కుమార్, వ్యాయామ ఉపాధ్యాయుడు వసంత రఘుబాబు, కంబాలపాటి నరసయ్యుయ, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గోన్నారు.

8వ వార్డులో రాఘవరెడ్డి విజయం

విశాలాంధ్ర-అద్దంకి ; మండలంలోని శంఖవరప్పాడు గ్రామ పంచాయతీ పరిధిలో శనివారం నిర్వహించిన 8వ వార్డు ఉప ఎన్నికల్లో వైసీపీ బలపరచిన బాపిరెడ్డి రాఘవరెడ్డి విజయం సాధించారు. వార్డు పరిధిలో 198 ఓటర్లు ఉండగా 157 ఓట్లు పోలయ్యాయి. వారిలో తెదేపా బలపరచిన బత్తుల శ్రీనివాసరెడ్డికి 48 ఓట్లు రాగా,వైసీపీ బలపరచిన బాపిరెడ్డి రాఘవరెడ్డికి 108 ఓట్లు వచ్చాయి. దీంతో వైసీపీ అభ్యర్థి రాఘవరెడ్డి 60 ఓట్ల మెజారిటీతో విజయం సాధించినట్లు ఎన్నికల అధికారి దేవసేనకుమారి ప్రకటించారు.

సంక్షేమ కార్యక్రమాలే వైసీపీకి బలం

విశాలాంధ్ర-అద్దంకి : వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్ పేదలకు అందిస్తున్న సంక్షేమ పథకాలే బలమని శాప్‌నెట్ చైర్మన్ నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు. శనివారం మండలంలోని సింగరకొండపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే రానున్న ఎన్నికల్లో మరోమారు వైసీపీని అధికారంలోకి తీసుకొస్తుందని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో ప్రజలు ప్రభుత్వానికి అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎర్రిబోయిన తిరుపతయ్య, మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్లు, వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.